# ఆన్‌లైన్ 'ఆందోళనా' గళాన్ని గౌరవించాలి !




₹ 10/-
జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 8 సంచిక - 04
పక్షపత్రిక ఫిబ్రవరి 16-28, 2017



# పంటల ధర అధికారం రైతుకే ఇవ్వాలి : యూత్ పార్లమెంట్



ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన వార్షికోత్సవ వేడుకలో పాల్గొన్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥జయప్రకాష్ నారాయణ్.

ఉద్యోగాల పట్లే విద్యార్థుల్లో ఎక్కువగా ఆందోళన కనిపిస్తోందని... వచ్చే ఇరవై ఏళ్లపాటు నెలకి 10లక్షల ఉద్యోగాల చొప్పున సృష్టించాల్సిన సవాలు ఈ దేశం ముందుందని జేపీ ఈ సందర్భంగా అన్నారు.





'పేదరికం నిర్మూలనకు రాజకీయ సంస్కరణలు, సుపరిపాలన' పై
నాగపూర్‌లోని ప్రత్యక్ష పన్నుల జాతీయ అకాడమీలో శిక్షణ పొందుతున్న
ఐఆర్ఎస్ (ఇండియన్ రెవిన్యూ సర్వీస్) అధికారులతో డా॥ జేపీ ముఖాముఖి.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక ఫిబ్రవరి 16-28, 2017

సంపుటి - 8 సంచిక - 4

## లోపలి పేజీల్లో...

అవినీతి అంతానికి నిజమైన ............... 5

కేంద్ర బడ్జెట్ 2017-18.................. 6

కేంద్రబడ్జెట్ బడాయి పథకాలు............. 10

బడ్జెట్ కంటే మెరుగైన దిశలో ఉన్న........11

ఆన్‌లైన్ ఆందోళనా గళాల్ని ................ 15

హోదా అడిగితే దేశద్రోహమా?............ 19

చంద్రబాబుకి అంత కంగారెందుకు ?..... 22

హోదాకోసం కలసి ఉద్యమించాల్సిన ... 23

సిక్కోలు నుంచే లోక్‌సత్తా ................ 24

ఆనాడు ఈ ఒక్కడి మాట విని ఉంటే...... 25

పార్టీ నేతల స్పందనని అభినందించిన... 27

దేశమాతను పూజించటమే ............... 28

పుర పాలనలో పౌరులెక్కడ?.............. 29

పంటల ధర నిర్ణయాధికారం రైతుకే.......31

పౌరసేవల చట్టంపై కేసీఆర్ ప్రభుత్వ.......33

ఈఎస్ఐ డిస్పెన్సరీ సమస్యల్ని............. 34

## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి


# వచ్చి పోయే బడ్జెట్, ఎన్నికలు!




'నిన్న రావాల్సిన జనతా ఎక్స్‌ప్రెస్ రేపు కూడా రావటం లేదు' అని భారతీయ రైల్వే గురించి ఒక ప్రముఖ రచయిత గతంలో చేసిన వ్యాఖ్య ఇప్పుడు మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుకి అతికినట్టు సరిపోతుంది. అరుదైన తీర్పుతో ప్రధాని అయిన మోదీ జమానాలో కూడా.. ప్రజల శక్తిసామర్థ్యాలను వెలికితీసేందుకు 2014లో రావాల్సిన ఎజెండా 2016లో కూడా రాలేదు. 2017 ప్రారంభంలోని కేంద్ర బడ్జెట్‌లో, ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కూడా ఆ దిశగా ఊసు కనిపించటం లేదు. రైల్వేల సమయపాలన మెరుగుపరచిన తరహాలో దశాబ్దాలు తీసుకుంటామంటే.. పోటీప్రపంచంలో అంత సమయం లేదు. యువతరం అత్యధిక సంఖ్యలో ఉండటం వల్ల భారత్‌కి మాత్రమే ఉన్న అద్భుత అవకాశాన్ని పాలకులు చేజారిపోయేలా చేస్తున్నారు. "దేశంలో కేవలం ఓ 20శాతం మందికి అవకాశాలుంటాయి, వారు ప్రభుత్వం మీద ఆధారపడకుండానే ఎదుగుతుంటారు. మిగతావారిని ఆ స్థాయికి తీసుకెళ్లటానికి నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు, స్థానిక సాధికారత వంటివి అందించటానికి కష్టపడే కంటే.. వారిని తేలిగ్గా మన చుట్టూ తిప్పుకునే తాయిలాలు, ఉచితాల స్కీముల్ని ప్రవేశపెడదాం. మరీ అంతగా కుదరకపోతే విద్వేషాల్ని రెచ్చగొట్టయినా, నినాదాలతో ఊరించయినా మైమరిపిద్దాం" అనే నిర్ణయానికి పాలకులు వచ్చేసినట్టు కనిపిస్తోంది. అందుకే ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో కీలకమైన విద్య, ఆరోగ్యం గురించి చాలా మొక్కుబడిగా స్పందించారు. రక్షిత మంచినీరు ఇవ్వటానికి, కాలుష్యం లేకుండా చేయటానికి చేసే ఖర్చుల్ని కూడా ఆరోగ్య విభాగం బడ్జెట్‌లో భాగంగా చూడాలని ఆర్థికమంత్రిత్వ శాఖ ప్రతినిధులు టీవీ చర్చల్లో అభివర్ణించటం ఎంత అసంబద్ధం! దేశవ్యాప్తంగా విచ్చలవిడి మద్యం వల్ల పేదల ఆరోగ్యానికి జరుగుతున్న నష్టం మాత్రం వారికి ఈ సందర్భంగా గుర్తురాలేదు. సామాన్య ప్రజల అమాయకత్వాన్ని, ప్రభుత్వంతో తమకు పనిలేదు కాబట్టి మనకెందుకు అనుకునే పైవర్గాల మౌనాన్ని ఆసరాగా చేసుకుని పాలనావ్యవస్థ ఇలాంటి దుస్సాహసాలకు పాల్పడుతోంది. టెలీ మెడిసిన్ అందిస్తాం, జబ్బు వచ్చాక తగ్గించేందుకు ఇన్సూరెన్స్ స్కీముల్ని అందిస్తామంటే.. ప్రజారోగ్యం గురించి మనకేమాత్రం ఆసక్తి లేదని అర్థం! ఇదే తరహాలో జబ్బు ముదిరాక పేదలకు వైద్య సాయం అందిస్తామని 2007లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టిన 'ఆరోగ్యశ్రీ' వల్ల ఏం జరిగింది? తెలంగాణ, నూతన ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య సంక్షోభం ఆగిందా? ప్రజలు నష్టపోతుంటే, కార్పొరేట్ ఆసుపత్రులు ఎందుకు లాభపడుతున్నాయి? ఆరోగ్యశ్రీ నమూనా సరికాదని, బ్రిటన్ తరహాలో అందరికీ, అన్ని జబ్బులకూ నాణ్యమైన వైద్యాన్ని ప్రజల మీద ఎటువంటి భారం లేకుండా ప్రభుత్వమే అందించే పథకాన్ని ప్రవేశపెట్టాలని లోక్‌సత్తా పలు సందర్భాల్లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రాథమిక వైద్యానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజారోగ్యానికి సవాలుగా ఉన్న గ్రామీణ భారతానికి కూడా వైద్యసేవలు అందేలా చేస్తూ.. జీడీపీలో కేవలం 2-3శాతంతోనే అందరికీ ఆరోగ్యం అందించే లోక్‌సత్తా నమూనాకు అంతర్జాతీయ ప్రశంసలు వచ్చాయిగానీ అమలుకు కేంద్రప్రభుత్వం మాత్రం మీనమేషాలు లెక్కిస్తోంది. అలాగే మన విద్యాప్రమాణాలు నాసిరకంగా ఉన్నాయని గత పదేళ్లుగా చెబుతున్న మాటనే 'అసర్' సర్వే ఈ ఏడాది కూడా కాస్త అటూఇటుగా చెప్పింది. స్కూలు ప్రభుత్వానిదా, ప్రయివేటుదా అన్న చర్చను పక్కనపెట్టి విద్యార్థులకు నాణ్యమైన చదువే ప్రమాణంగా చూసినా.. 2016లో కూడా ఏపీ, తెలంగాణ సహా మన దేశవ్యాప్తంగా విద్యాప్రమాణాలు దిగజారుడుగా కొనసాగుతున్నాయి. దేశంలోని 589 జిల్లాల్లోని గ్రామీణ పాఠశాలల విద్యాస్థితిగతులపై వచ్చిన అసర్ సర్వేలో సగం మంది విద్యార్థులు (సుమారు 13కోట్లమంది) తాము చదువుతున్న తరగతి కంటే మూడు తరగతుల దిగువన ఉండే పాఠ్యపుస్తకాలను చదవలేరు, లెక్కలు చేయలేరు. 8వ తరగతిలో మూడంకెల సంఖ్యని ఏక సంఖ్యతో భాగాహారం చేసేవారి సంఖ్య 2014లో 44.2శాతం ఉంటే, ఇప్పుడు 43.2శాతానికి పడిపోయింది. విద్యారంగ పరిస్థితి చాలా నిరాశాజనకంగా ఉందని అసర్ నివేదికను విడుదల చేస్తూ కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వ్యాఖ్యానించారుగానీ, బడ్జెట్‌లో మాత్రం ఎలాంటి దిద్దుబాటూ లేదు. బడ్జెట్‌లకున్న ప్రాధాన్యత క్రమంగా తగ్గుతున్నా.. ప్రభుత్వ ప్రాథమ్యాలు ఇందులో బైటపడతాయి. ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్న రెండు కీలక రాష్ట్రాలు ఉత్తర ప్రదేశ్, పంజాబ్‌లనే తీసుకుంటే.. ప్రయివేటు స్కూళ్లలో పిల్లల సంఖ్య 50శాతం దాటిపోయింది. పాఠశాల విద్యార్థి మీద జాతీయస్థాయి సగటు కంటే ఎక్కువ ఇక్కడ ఖర్చు చేస్తున్నా.. విద్యాప్రమాణాలు దేశంలోనే అధ్వాన్నంగా ఉన్నాయి. యూపీ ప్రభుత్వ పాఠశాలల్లో మూడవ తరగతి చదివేవారిలో కేవలం 7.2శాతం మాత్రమే రెండవ తరగతి పాఠ్యపుస్తకాన్ని చదవగలుగుతున్నారు. 7.9శాతం మాత్రమే రెండంకెల తీసివేతలు చేయగలుగుతున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల్లో రెండవ తరగతి ఇంగ్లీష్ పుస్తకంలో పది వాక్యాల్ని చదవగలిగే పిల్లల సంఖ్య 2010లో ఉన్న 77.7 నుంచి ఇప్పుడు 67.8కి పడిపోయిది. పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఉన్నా, యూపీలో ఎక్కడా విద్యాప్రమాణాల పెంపు గురించి పార్టీలు మాట్లాడలేదు. తాత్కాలిక పథకాలకు దూరమని ప్రధాని కాగలిగిన మోదీ.. రాష్ట్ర స్థాయిలో రైతు రుణమాఫీని ప్రకటించారుగానీ, మంచి చదువు గురించి మాట్లాడలేదు. పంజాబ్‌లో 'ఆప్' కూడా విద్య, ఆరోగ్యం గురించి మాట్లాడలేదు. ఎన్నికలలో ఎవరు గెలిచారు, ఎవరు ఓడారు అని ఉత్కంఠభరితంగా చర్చిస్తుంటాం, వచ్చే ఎన్నికల ఫలితాల గురించి ఊహాగానాలు చేస్తుంటాంగానీ.. గెలిచినవాళ్లు చేయాల్సినవి చేస్తున్నారా అని మాత్రం ప్రశ్నించటం లేదు. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి, ప్రజల రోజువారీ పనులు సక్రమంగా జరగటానికి పౌరసేవల చట్టం, బలమైన స్థానిక ప్రభుత్వాలు వంటి ఏర్పాట్లు లేని బడ్జెట్‌లు, ఎన్నికలు ఎన్ని వస్తే ఏం లాభం? సామాన్యులను నిర్లక్ష్యం చేయటం వల్లే, పాలనలో అభివృద్ధిలో వారిని భాగస్వాముల్ని చేయకపోబట్టే ట్రంప్ లాంటి వ్యక్తి అమెరికాలో గెలవగలిగారు. రేపు భారత్‌లో కూడా అదే పరిస్థితి పేట్రేగటానికి అన్ని రకాలుగా అవకాశాలున్నాయి. కానీ అమెరికాలో ఉన్నట్లు ఇక్కడ ప్రధానమంత్రిని, ముఖ్యమంత్రుల్ని కట్టడి చేయటానికి తగిన స్థాయిలో ప్రజాస్వామిక సంస్కృతి, వికేంద్రీకరణ, స్వయందిద్దుబాటు వ్యవస్థలేవీ?

మీ

[signature]




## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును **"లోక్‌సత్తా టైమ్స్"** ఎకౌంట్ *నం: 62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# అవినీతి అంతానికి నిజమైన ప్రయత్నం లేదు, విద్య, ఆరోగ్యాల్ని పట్టించుకోలేదు: కేంద్ర బడ్జెట్ 2017-18పై జేపీ

***నల్లధనం, దానితో ముడిపడిన అవినీతి అంతానికి పెద్ద నోట్లు రద్దు చేశామని పదేపదే చెబుతున్నా.. అవినీతి నిర్మూలనకు నిజమైన ప్రయత్నం ఎక్కడా బడ్జెట్‌లో కనిపించలేదని జేపీ అన్నారు. దిగువ స్థాయి అవినీతికి మూలమైన ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు లంచాలు లేకుండా సేవలు అందించేందుకు 'పౌర సేవల' చట్టం వంటి ఏర్పాట్లు ప్రస్తావన లేదని, ఉన్నత స్థాయికి అవినీతికి తల్లి వేరు లాంటి రాజకీయ విరాళాలపై పైపై మార్పులతో సరిపెట్టారని అన్నారు. ఈ మౌలికపరమైన వైఫల్యాల వల్ల చరిత్రాత్మకం కావాల్సిన బడ్జెట్.. సాదాసీదాగా మారిందన్నారు.***

మౌలిక వసతులు, గ్రామీణ రంగాలపై దృష్టి పెట్టటం, ద్రవ్య క్రమశిక్షణ, సూక్ష్మ - చిన్న - మధ్యతరహా పరిశ్రమలకు కార్పొరేట్ పన్ను రాయితీ, సామాన్య ఉద్యోగులకు ఆదాయపు పన్ను ఊరట కేంద్ర ప్రభుత్వ తాజా బడ్జెట్‌లో ఆహ్వానించదగ్గవని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. కానీ బ్యాంకుల మొండి బకాయిలు, కార్పొరేట్ సంస్థల వైఫల్యం, కాకి లెక్కలు, ప్రైవేట్ పెట్టుబడులు క్షీణించటం వంటి అంశాలను పరిష్కరించే ఉద్దేశం ప్రభుత్వానికి ఉన్నట్టు కనిపించలేదన్నారు. డిజిటలైజేషన్ మంచిదేగానీ, సర్వరోగనివారిణి కాదన్నారు.

**కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ లోక్‌సభలో ప్రవేశపెట్టిన 2017-18 బడ్జెట్‌పై జేపీ స్పందిస్తూ..** సుస్థిరాభివృద్ధికి కీలకమైన విద్య, ఆరోగ్యం పట్ల బడ్జెట్‌లో సర్కారు ఆసక్తి కనబరచలేదని, పైపై మాటలతో సరిపెట్టిందని అన్నారు. ఒక్క ఆరోగ్యసేవల రంగంలోనే 1కోటి ఉద్యోగాలు వచ్చే అవకాశమున్నా ప్రభుత్వం చొరవ చూపలేదన్నారు.

నల్లధనం, దానితో ముడిపడిన అవినీతి అంతానికి పెద్ద నోట్లు రద్దు చేశామని పదేపదే చెబుతున్నా.. అవినీతి నిర్మూలనకు నిజమైన ప్రయత్నం ఎక్కడా బడ్జెట్‌లో కనిపించలేదని జేపీ అన్నారు. దిగువ స్థాయి అవినీతికి మూలమైన ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు లంచాలు లేకుండా సేవలు అందించేందుకు 'పౌర సేవల' చట్టం వంటి ఏర్పాట్లు ప్రస్తావన లేదని, ఉన్నత స్థాయికి అవినీతికి తల్లి వేరు లాంటి రాజకీయ విరాళాలపై పైపై మార్పులతో సరిపెట్టారని అన్నారు. ఈ మౌలికపరమైన వైఫల్యాల వల్ల చరిత్రాత్మకం కావాల్సిన బడ్జెట్.. సాదాసీదాగా మారిందన్నారు.

**ప్రధాన సమస్య ఓట్ల కొనుగోలు తప్ప పార్టీల అకౌంట్లు కాదు**

రాజకీయ అవినీతికి ప్రధాన కారణం ఎన్నికల్లో ఓట్ల కొనుగోలు తప్ప పార్టీల అకౌంట్లు కాదని జేపీ అన్నారు.


పార్టీల జమాఖర్చుల వివరాలకే పరిమితం కాకుండా, వ్యవస్థీకృత మార్పుల్ని తీసుకొస్తేనే రాజకీయ అవినీతిని, నల్లధనాన్ని కట్టడి చేయగలమని జయప్రకాష్ నారాయణ్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

**వెనకబడిన జిల్లాలనూ పట్టించు కోలేదు**

ఏపీ ప్రత్యేక హోదా గురించి ఎంతో చర్చ జరుగుతున్నా, వెనకబడిన 40శాతం జిల్లాలకు కేవలం 29శాతం నిధులే కేటాయిస్తున్నారని ఆర్థిక సర్వే చెప్పినా కూడా.. వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణకు పారిశ్రామిక రాయితీలు కల్పించటం గురించి బడ్జెట్‌లో ప్రస్తావించకపోవటం బాధ్యతారాహిత్యమని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. పరపతి విధానాన్ని బాగుచేయకుండా వ్యవసాయ రుణాలను ఓ లక్ష కోట్లు పెంచటం వల్ల రైతులకు ఒరిగేదేమీ ఉండదన్నారు. విద్య, ఆరోగ్యం, ఎన్నికల సంస్కరణలపై ప్రభుత్వం చాలా మొక్కుబడిగా స్పందించిందన్నారు. విశాఖరైల్వే జోన్, గిరిజన వర్సిటీకి తగినన్ని నిధుల కేటాయింపు బడ్జెట్‌లో లేవన్నారు. ఎన్నికలప్పుడు ఒకలా, ఇప్పుడు మరోలా మోదీ వ్యవహరిస్తున్నారన్న భావనకు ఊతమిచ్చేలా బడ్జెట్ ఉందన్నారు. సమావేశంలో లోక్‌సత్తా నేతలు నాగభూషణం, పోలుపర్తి అప్పారావు, శిమ్మ శ్రీను, చంద్రరావు, రాజారావు, మొల్లేటి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు. ✦

# కేంద్ర బడ్జెట్ 2017-18

పెద్ద నోట్ల రద్దు నిర్ణయంతో తీవ్ర కష్టాలపాలైన పేద, దిగువ మధ్యతరగతి ప్రజలను ఊరడించటం, ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో ఓటర్లను గ్రామీణ సంకేతంతో ఆకట్టుకోవటం ప్రధాన లక్ష్యాలుగా నరేంద్ర మోదీ ప్రభుత్వం 2017-18 బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. అయితే ఈ పరిధిలో కూడా కొత్తగా ఆలోచించి సృజనాత్మక, ఆచరణీయ పరిష్కారాలతో ప్రజలను ఆకట్టుకునే చొరవను చూపకుండా పాత మూసలోనే వ్యవహరించటం వల్ల.. సమ్మిళిత అభివృద్ధికి కీలకమైన విద్య, ఆరోగ్యం, అవినీతి నిర్మూలన, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు వేధింపులు లేని సేవలు వంటి అంశాలు దెబ్బతిన్నాయి. బడ్జెట్‌లో దాదాపు సగం స్థాయిలో.. సుమారు రూ.10లక్షల కోట్ల మేర ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పేరుకుపోయిన మొండిబకాయిలు గుదిబండగానే కొనసాగుతూ దేశానికి రాబోయే ప్రమాదాన్ని హెచ్చరిస్తున్నా పట్టించు కోలేదు. తెలివితక్కువ విన్యాసాలేవీ లేకపోయినా, ఈ మౌలిక వైఫల్యాల వల్లే.. డీమానిటైజేషన్, జీఎస్‌టీ నేపథ్యంలో చరిత్రాత్మకం కావాల్సిన కేంద్ర వార్షిక బడ్జెట్ 'బండి నడిస్తే చాలు' అనే స్థాయిలో సాదాసీదా బడ్జెట్‌గా మారింది.




ఇప్పటివరకు విడిగా వున్న రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్‌లో కలిపివేయటంతోపాటు ఫిబ్రవరి నెలాఖరున బడ్జెట్‌ను ప్రవేశపెట్టే సంప్రదాయానికి ముగింపు పలుకుతూ ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ 2017-18 బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. రైతులు, గ్రామీణ జనాభా, యువత, పేదలు, అణగారిన వర్గాలు, మౌలిక సదుపాయాలు, ఆర్థికరంగం, డిజిటల్ ఆర్థికత, ప్రజాసేవ, సమర్థ ద్రవ్య వినియోగం, పన్ను పరిపాలన - అనే పది భావనల కింద బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. డిజిటల్ పునాదితో 'టెక్' (ట్రాన్స్‌ఫాం, ఎనర్జయిజ్, క్లీన్) ఇండియాని సాధించటం బడ్జెట్ లక్ష్యమన్నారు. ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయాల విభజనను రద్దు చేసిన నేపథ్యంలో క్యాపిటల్, రెవెన్యూ వ్యయాల మీదే దృష్టి పెట్టామని తెలిపారు.

**కేంద్ర బడ్జెట్ అంచనా: రూ.21,47,000కోట్లు**

**ద్రవ్య లోటు: 3.2శాతం**

**రెవెన్యూ లోటు: 1.9శాతం**

**రైల్వేకు మొత్తం కేటాయింపులు: రూ.1,31,000కోట్లు**

### గ్రామీణ భారత్‌కు పెద్దపీట

మహాత్మాగాంధీని, కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకుంటూ.. ఈ ఏడాది బడ్జెట్‌లో గ్రామీణ భారతదేశానికి పెద్దపీట వేశారు. దేశంలో దాదాపు ఐదు కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ.48,000 కోట్లను కేటాయించారు. మహాత్మాగాంధీ 150వ జయంతిని పురస్కరించుకుని 2019 నాటికి దేశవ్యాప్తంగా 1కోటి కుటుంబాలను, 50వేల గ్రామ పంచాయతీలను పేదరికం నుంచి బయటకు తీసుకురావటమే ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. 2019 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో 2.23లక్షల కిలోమీటర్ల రహదారులను నిర్మించి 65వేల ఆవాస ప్రాంతాలను అనుసంధానిస్తామని ఆర్థికమంత్రి తెలిపారు. గ్రామీణ ప్రజల ఇళ్ల నిర్మాణం కోసం ప్రధానమంత్రి గ్రామ్ ఆవాస్ యోజనకు రూ.23వేల కోట్లను కేటాయించారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖకు నిధులను ఇప్పుడున్న రూ.97,760కోట్ల నుంచి రూ.1,07,758 కోట్లకు పెంచారు. వ్యవసాయ రుణాలను రూ.10లక్షల కోట్లకు పెంచారు. ప్రస్తుతంతో పోలిస్తే ఇది రూ.లక్ష కోట్లు అధికం. రూ.5,000కోట్లతో నాబార్డ్ సూక్ష్మసాగు నిధిని, రూ.8,000కోట్లతో నాబార్డ్ 'డెయిరీ ప్రాసెసింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్'ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గ్రామీణ, వ్యవసాయ, అనుబంధ రంగాలకు మొత్తమ్మీద రూ.1,87,223కోట్లు కేటాయించారు. ప్రస్తుతంతో పోలిస్తే ఇది 24శాతం అధికం.

## ఇదీ బడ్జెట్ స్వరూపం..

(రూ. కోట్లలో)

| | 2015-16 వాస్తవ కేటాయింపులు | 2016-17 బడ్జెట్ అంచనాలు | 2016-17 సవరించిన అంచనాలు | 2017-18 బడ్జెట్ అంచనాలు |
|---|---|---|---|---|
| 1. రెవెన్యూ వసూళ్లు (2+3) | 11,95,025 | 13,77,022 | 14,23,562 | 15,15,771 |
| 2) పన్ను ఆదాయం | 9,43,765 | 10,54,101 | 10,88,792 | 12,27,014 |
| 3) పన్నేతర ఆదాయం | 2,51,260 | 3,22,921 | 3,34,770 | 2,88,757 |
| 4. మూలధన వసూళ్లు (5+6+7) | 5,95,758 | 6,01,038 | 5,90,845 | 6,30,964 |
| 5) రుణాల రికవరీ | 20,835 | 10,634 | 11,071 | 11,932 |
| 6) ఇతర వసూళ్లు | 42,132 | 56,500 | 45,500 | 72,500 |
| 7) అప్పులు, ఇతరత్రా వసూళ్లు | 5,32,791 | 5,33,904 | 5,34,274 | 5,46,532 |
| 8) మొత్తం వసూళ్లు (1+4) | 17,90,783 | 19,78,060 | 20,14,407 | 21,46,735 |
| 9) పథకాలుకాక ఇతర వ్యయం (10+12) | 10,65,669 | 11,76,094 | 11,44,560 | 12,01,657 |
| 10) రెవెన్యూ ఖాతా | 9,92,142 | 11,29,137 | 11,03,049 | 11,62,877 |
| 11) వడ్డీ చెల్లింపులు | 4,41,659 | 4,92,670 | 4,83,069 | 5,23,078 |
| 12) మూలధన ఖాతా | 73,527 | 46,957 | 41,511 | 38,780 |
| 13) పథకాల వ్యయం (14+15) | 7,25,114 | 8,01,966 | 8,69,847 | 9,45,078 |
| 14) రెవెన్యూ ఖాతా | 5,45,619 | 6,01,900 | 6,31,511 | 6,74,057 |
| 15) మూలధన ఖాతా | 1,79,495 | 2,00,066 | 2,38,336 | 2,71,021 |
| 16) మొత్తం వ్యయం (9+13) | 17,90,783 | 19,78,060 | 20,14,407 | 21,46,735 |
| 17) రెవెన్యూ వ్యయం (10+14) | 15,37,761 | 17,31,037 | 17,34,560 | 18,36,934 |
| 18) మూలధన ఆస్తుల కోసం కేటాయించిన గ్రాంట్లు | 1,31,754 | 1,66,840 | 1,71,472 | 1,95,350 |
| 19) మూలధన వ్యయం (12+15) | 2,53,022 | 2,47,023 | 2,79,847 | 3,09,801 |
| 20) రెవెన్యూ లోటు (17-1) | 3,42,736 | 3,54,015 | 3,10,998 | 3,21,163 |
| 21) ద్రవ్య లోటు (16-(1+5+6)) | 5,32,791 | 5,33,904 | 5,34,274 | 5,46,532 |
| 22) ప్రాథమిక లోటు (21-11) | 91,132 | 41,234 | 51,205 | 23,454 |



### మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

పెట్టుబడులకు, ఉద్యోగావకాశాలకు, అభివృద్ధికి కీలకమైన మౌలిక సదుపాయాలకు కేటాయింపుల్ని బడ్జెట్‌లో గణనీయంగా పెంచారు. ఇందులో భాగంగా రైల్వేల అభివృద్ధికి రూ. 1,31,000కోట్ల ప్రణాళికలో రూ. 55,000కోట్లు ప్రభుత్వం అందచేయనున్నట్టు ఆర్థికమంత్రి తెలిపారు. రూ.లక్ష కోట్ల కార్పస్ ఫండ్‌తో ప్రయాణీకుల భద్రత నిధిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరం 3,500 కిలోమీటర్ల రైల్వేలైన్లను వేస్తామని చెప్పారు. రహదారులకు సంబంధించి రూ. 64,900కోట్లను జైట్లీ కేటాయించారు. రైలు, రోడ్డు, జలరవాణాకు కలిపి రూ. 2,41,387 కోట్లు ప్రకటించారు.

రక్షణ రంగానికి రూ. 2,74,114 కోట్లు కేటాయించారు.

### చిన్న సంస్థలకు రాయితీలు


సూక్ష్మ – చిన్న – మధ్యతరహా పరిశ్రమలకు ఊతమిచ్చేలా ఆయా సంస్థలపై విధించే కార్పొరేట్ పన్నును బడ్జెట్‌లో 30 నుంచి 25శాతానికి తగ్గించారు. అదేవిధంగా కనీస ప్రత్యామ్నాయ పన్ను (మ్యాట్) చెల్లింపుల గడువును ప్రస్తుతమున్న పదేళ్ల నుంచి 15 ఏళ్లకు పెంచారు.

విదేశీ పెట్టుబడిదారులకు కొన్ని రంగాల్లో పన్ను రాయితీలు ప్రకటించారు. ఎఫ్‌డీఐ (విదేశీ ప్రత్యక్ష

### రైల్వే బడ్జెట్ లక్ష్యాలు

| విభాగం | 2016-17 | 2017-18 |
|---|---|---|
| కొత్తలైన్ల నిర్మాణం (కి.మీ) | 900 | 800 |
| గేజ్ మార్పిడి (కి.మీ) | 900 | 900 |
| డబ్లింగ్ (కి.మీ) | 1,050 | 1800 |
| డీజిల్ ఇంజిన్ల తయారీ | 467 | 290 |
| విద్యుత్ ఇంజిన్లు | 300 | 334 |
| ప్రయాణీకుల బోగీలు | 4,291 | 4,695 |
| సరకు వ్యాగన్లు | 12,000 | 12,000 |
| విద్యుదీకరణ ప్రాజెక్టులు | 2,000 | 4,000 |

తెలంగాణకు సంబంధించి ఆదిలాబాద్–ఆర్మూర్ వయా నిర్మల్ రైలు మార్గానికి రూ. 2800 కోట్లతో ఆమోదం లభించింది. మరో నాలుగు మార్గాల సర్వేకు, యాదాద్రి మార్గానికి నిధులు మంజూరయ్యాయి. ఎంఎంటీఎస్ రెండో దశకు రూ. 100 కోట్లు కేటాయించారు. ఏపీలో అమరావతికి రూ. 2,680కోట్ల అంచనాతో మూడు లైన్లను మంజూరు చేశారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యం ఉంటుంది.




పెట్టుబడులు)కి సంబంధించిన ఆంక్షలను తొలగిస్తూ చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. 'విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు'ను రద్దు చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే ఆ బోర్డు అధికారాలను తగ్గిస్తూ వచ్చారు.

వస్తు సేవల పన్ను (జీఎస్టీ) త్వరలో అమలులోకి వస్తున్న నేపథ్యంలో.. పరోక్ష పన్నులపై ఆర్థిక మంత్రి పెద్దగా దృష్టి పెట్టలేదు.

పొగాకు ఉత్పత్తులు, మొబైల్ ఫోన్ల సర్క్యూట్లు వంటి కొన్ని ఉత్పత్తులపై పన్ను పెంచారు.

### సామాన్య వేతన జీవులకు చిన్న ఊరట

రూ.2.5 నుంచి 5లక్షల మధ్య ఆదాయం ఉన్నవారికి వ్యక్తిగత ఆదాయ పన్నుని పది శాతం నుంచి ఐదు శాతానికి కుదించారు. రూ.50లక్షల నుంచి 1కోటి ఆదాయం ఉన్నవారిపై పన్నుకు అదనంగా 10శాతం సర్‌ఛార్జి విధించారు. రూ.కోటి మించి వార్షికాదాయం ఉన్నవారిపై 15శాతం సర్‌ఛార్జి కొనసాగనున్నది.

### రాజకీయ పార్టీల విరాళాలపై పైపై చర్యలు

నల్లధనంపై పోరాటం కొనసాగిస్తున్నామని చెప్పుకోవటం కోసం జైట్లీ కొన్ని చర్యలు ప్రకటించారు. రూ.3లక్షలకు మించిన నగదు లావాదేవీలపై నిషేధం విధించారు. అంతకుమించిన చెల్లింపులు ఇక మీదట కచ్చితంగా నగదురహిత విధానంలోనే జరపాలి. ఒకవేళ నగదు రూపంలో ఆ లావాదేవీలు నిర్వహిస్తే వంద శాతం జరిమానా విధిస్తారు. భారతీయ వ్యవస్థను దుర్వినియోగం చేసి, చట్టానికి చిక్కకుండా పారిపోయినవారిని కట్టడి చేయడానికి వీలుగా వారి ఆస్తుల్ని స్వాధీనం చేసే చట్టం చేసే ఆలోచన ఉందని మంత్రి తెలిపారు. రాజకీయ పార్టీలు (ఒక వ్యక్తి నుంచి) నగదు రూపంలో స్వీకరించే విరాళాల పరిమితిని రూ.20వేల నుంచి 2,000కి కుదించారు. విరాళాలను చట్టబద్ధంగా అందించేందుకు వీలుగా ఎలక్టొరల్ బాండ్స్‌ని ప్రవేశపెడతారు. డొనేషన్లు ఇవ్వాలనుకునేవారు వీటిని బ్యాంకుల నుంచి కొనుగోలు చేయవచ్చు.

ట్యాక్స్ రిటర్నులను మార్చుకోవటానికి ఉన్న కాలపరిమితిని 12 నెలలకు కుదించారు.

నోట్ల రద్దు నిర్ణయం వల్ల నష్టం తీవ్రంగా ఉన్నప్పటికీ ఎటువంటి వివరాల్ని ఆర్థికమంత్రి వెల్లడించే ప్రయత్నం చేయలేదు. ఆర్థికరంగానికి డీమానిటైజేషన్ మేలుచేసిందని చెప్పుకొచ్చారు. రద్దయిన పాత నోట్లు బ్యాంకు ఖాతాల్లో జమ అయిన తీరును బట్టి పన్ను పరిధిని విస్తరించుకోవటానికి, ఆదాయాన్ని పెంచుకోవటానికి అవకాశం లభించిందన్నారు.

### రాష్ట్రాలకు వాటా

రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు రూ. 4.11 లక్షల కోట్ల విలువైన వనరులను బదిలీ చేస్తున్నట్టు ఆర్థిక మంత్రి తెలిపారు. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఈ మొత్తం రూ. 3.6లక్షల కోట్లు.

### తెలుగు రాష్ట్రాలకు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో ప్రత్యక్షంగా చేసిన కేటాయింపుల కంటే వివిధ పథకాల ద్వారా వచ్చేవే ఎక్కువగా కనిపిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాజెక్టులకు విదేశీ ఆర్థిక సాయం కింద ప్రపంచబ్యాంకు ద్వారా రూ. 990కోట్ల రుణం అందుతుందని బడ్జెట్‌లో తెలిపారు. ఏపీ, తెలంగాణ మునిసిపల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు రూ. 390 కోట్లు, ఏపీ ప్రకృతి వైపరీత్యాల నివారణ, రూరల్ ఇంక్లూజివ్ గ్రోత్ ప్రాజెక్టులకు రూ. 400కోట్లు అందుతుంది. విజయవాడ-రాంచీ మధ్య నక్సల్స్ ప్రభావిత ప్రాంతంలో 250కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 900కోట్లు కేటాయించారు. అమరావతికి భూములిచ్చిన రైతులకు మూలధన ఆదాయపు పన్ను నుంచి మినహాయింపునిచ్చారు. రెండు రాష్ట్రాల్లో రైల్వే కేటాయింపుల్ని గత ఏడాది కంటే పెంచారు. గిరిజన విశ్వవిద్యాలయాలకు రూ. 20కోట్లు, పారిశ్రామిక వడ్డీ రాయితీల కింద రూ. 100 కోట్లు ఇచ్చారు.

### కేంద్ర బడ్జెట్‌లోని ఇంకొన్ని అంశాలు:

- అంకుర పరిశ్రమలకు మూడేళ్లు పన్ను ప్రయోజనాలు
- స్థిరాస్తుల అమ్మకాలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను విధించే గడువు మూడేళ్ల నుంచి రెండేళ్లకు తగ్గింపు
- మార్కెట్ నుంచి రూ. 6.05లక్షల కోట్ల అప్పులు
- డిజిటల్ చెల్లింపుల్ని ప్రోత్సహించడానికి వీలుగా 'పాయింట్ ఆఫ్ సేల్' యంత్రాలు, ఐరిస్ రీడర్లపై సుంకం మినహాయింపు
- అందుబాటు ధర గృహాలకు మౌలిక సదుపాయాల స్థాయి
- మహిళా, శిశు సంక్షేమానికి రూ. 1.84 లక్షల కోట్లు
- గ్రామీణ, వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ. 1.87లక్షల కోట్లు
- ఇళ్లు లేనివారికోసం 2019 నాటికి కోటి గృహాలు
- 2018 నాటికి అన్ని గ్రామాలకూ విద్యుత్తు
- నూతన మెట్రో రైలు విధానం
- అక్రమ డిపాజిట్ పథకాలను నివారించడానికి బిల్లు
- బ్యాంకులకు రూ. 10,000కోట్ల అదనపు మూలధనం
- బీడీలు, చుట్టలపై ఎక్సయిజ్ సుంకం 12.5శాతానికి పెంపు
- ముద్రా యోజన కింద రుణ వితరణ లక్ష్యం రూ. 2.44లక్షల కోట్లకు పెంపు
- ఆర్థిక రంగం కోసం 'కంప్యూటర్ అత్యవసర ప్రతిస్పందన దళం' ఏర్పాటు
- కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను స్టాక్‌మార్కెట్‌లో నమోదు చేయడానికి నిర్దిష్ట కాలావధితో కార్యక్రమం
- డిజిటల్ చెల్లింపుల్ని నియంత్రించడానికి రిజర్వుబ్యాంకులో 'చెల్లింపుల నియంత్రణ మండలి' ఏర్పాటు
- ఐఆర్‌సీటీసీ ద్వారా తీసుకునే ఈ-టికెట్లపై సేవా రుసుములు రద్దు
- పెట్టుబడుల ఉపసంహరణ పరిమితి రూ. 56,500 కోట్ల నుంచి రూ. 72,500కి పెంపు
- యువతలో నైపుణ్యాల్ని పెంచేందుకు రూ. 4,000కోట్లతో సంకల్ప్ పథకం. మార్కెట్ అవసరాలకు తగ్గట్టు 3.5కోట్ల మందికి యువతకు శిక్షణ ఇవ్వాలన్నది లక్ష్యం
- బేటీ బచావో - బేటీ పఢావోకి రూ. 200కోట్లు, నిర్భయ నిధికి రూ. 500కోట్లు
- ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి రూ. 52,393కోట్లు, 31,920కోట్లు కేటాయించారు
- హోం శాఖకు రూ. 83వేల కోట్లు కేటాయింపు
- శాస్త్రసాంకేతిక రంగాలకు రూ. 37,485 కోట్లు కేటాయించారు
- పాఠశాల విద్య, అక్షరాస్యతకు రూ. 46,356 కోట్లు. ఉన్నత విద్యకు రూ. 33,329కోట్లు. ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం అన్నిరకాల ఎంట్రెన్స్ పరీక్షల్ని నిర్వహించేందుకు 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' ఏర్పాటు. ఆన్‌లైన్ కోర్సులకు ప్రోత్సాహం
- వైద్యరంగానికి కేవలం రూ. 47,352.51కోట్లు కేటాయింపు. అది కూడా ద్వితీయ, తృతీయ స్థాయిల్లో వైద్యరంగాన్ని బలోపేతం చేసే సాధారణ చర్యల కోసం తప్ప.. ఆరోగ్యానికి కీలకమైన ప్రాథమిక వైద్యాన్ని బలోపేతం చేయటం కోసం కాదు. ✦

# కేంద్ర బడ్జెట్ బడాయి పథకాల అమలు ఎంత గొప్పగా ఉందంటే...




నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం పేదల కోసం, గ్రామీణ ప్రజల కోసం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పథకాలకు 2017-18 బడ్జెట్‌లో భారీ మొత్తాలను కేటాయిస్తున్నట్టు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పినప్పటికీ.. ఆ స్కీముల్లో చాలామట్టుకు అసమర్థత, అవినీతితో అధ్వాన్నంగా తయారయ్యాయని గణాంకాలు రుజువు చేస్తున్నాయి.

గణాంకాలు, కార్యక్రమాల అమలు (ఎంఓఎస్‌పీఐ) ఇచ్చిన నివేదిక ప్రకారం గత ఏడాది కేంద్ర బడ్జెట్‌లో భారీ కేటాయింపులున్న దాదాపు 12 సంక్షేమ పథకాలు అమలులో లక్ష్యాలకు ఆమడదూరంలో ఉన్నాయి.

ఉదాహరణకు ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు 2016-17లో చేసిన రూ. 15,000 కోట్ల నుంచి ఈ ఏడాది రూ. 23,000కోట్లకు కేటాయింపుల్ని పెంచుతున్నట్టు జైట్లీ చెప్పారు. 2019నాటికి 1 కోటి ఇళ్లను సరైన గృహవసతి లేని పేదలకు నిర్మించి ఇస్తామని మంత్రి అన్నారు. కానీ 27 రాష్ట్రాలు గత ఏడాది బడ్జెట్‌లో నిర్ణయించిన లక్ష్యాలను చేరుకోలేకపోయాయి. బీహార్ 37శాతం లక్ష్యాన్ని చేరుకోగా, మోదీ స్వరాష్ట్రమైన గుజరాత్ కేవలం 20శాతం లక్ష్యాన్ని పూర్తి చేసింది. ఛత్తీస్‌గఢ్ 4శాతానికే పరిమితమైంది.

అలాగే పీఎంజీఎస్‌వై (ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన)కు గత ఏడాది రూ. 19,000 కోట్లు కేటాయించగా, 14 రాష్ట్రాలు లక్ష్యాన్ని చేరుకోలేదు. ఈ స్కీముకి ఈ ఏడాది కూడా రూ. 19,000 కోట్లు కేటాయించారు.

**ఎస్సీ కుటుంబాలకు సాయం**

2016-17లో రూ. 4,883కోట్లు కేటాయించగా 24 రాష్ట్రాలు లక్ష్యాన్ని చేరుకోలేదు. ఈ ఏడాది రూ. 5,114కోట్లు కేటాయించారు.

**దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన**

గత బడ్జెట్‌లో రూ. 3,350కోట్లు కేటాయించారు. 14 రాష్ట్రాలు ఈ స్కీము స్వరూపాన్నే చెల్లాచెదురు చేసేశాయి. ఛత్తీస్‌గఢ్ 32శాతం లక్ష్యాన్ని చేరుకోగా, కర్ణాటక 20శాతాన్ని సాధించింది. ప్రస్తుత బడ్జెట్‌లో రూ. 4,814కోట్లు ఇచ్చారు.

**జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్**

2016-17లో రూ. 3,000కోట్లు కేటాయించగా, తమిళనాడు, కేరళ మాత్రమే లక్ష్యాలను సాధించాయి. దాదాపు 22 రాష్ట్రాల్లో ఈ స్కీము అధ్వాన్నంగా ఉంది. తాజా బడ్జెట్‌లో రూ. 4,500కోట్లు కేటాయించారు.

**జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్**

లోక్‌సత్తా చొరవతో యూపీయే హయాంలో వచ్చిన ఈ మిషన్‌కి 2016-17లో రూ. 22,630కోట్లు కేటాయించారు. కానీ 72శాతం మంది గ్రామీణులకు ప్రభుత్వ కమ్యూనిటీ కేంద్రాలలో ఆరోగ్య సేవలు అందటంలేదని ఎన్ఎస్ఎస్‌వో నివేదిక పేర్కొంది. 2016-17లో ఈ మిషన్‌కి రూ. 27,131కోట్లు ప్రకటించారు. ✦

# బడ్జెట్ కంటే మెరుగైన దిశలో ఉన్న ఆర్థిక సర్వే 2016-17



ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ కంటే.. ఆర్థిక సర్వేనే కొంత సరైన దిశలో ఉందనే భావన వ్యక్తమవుతోంది. కొంత నాటకీయత, కీలక సమస్యలపై దాటవేత ఉన్నప్పటికీ సమస్యల్ని సర్వే స్పృశించింది. మెరుగైన పరిష్కారాలు అందించేందుకు ప్రయత్నించింది. డిజిటల్ చెల్లింపులు ప్రోత్సహించటానికి నోట్ల రద్దు చేసినట్టు కేంద్ర ప్రభుత్వం చేసిన కొన్ని ప్రకటనల్ని సర్వే ఆక్షేపించింది. అన్నిటికీ డిజిటలైజేషనే పరిష్కారం కాదని, నూరుశాతం నగదు రహిత అసాధ్యమని పేర్కొంది. నోట్ల రద్దు అసాధారణ ప్రయోగమని, దీనిపై చర్చ జరగాలని అభిప్రాయపడింది. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో దాదాపు రూ.10లక్షల కోట్ల మొండిబకాయిల సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించింది.

బడ్జెట్ సమావేశాల తొలిరోజు పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగించిన తర్వాత సర్వే నివేదికను ప్రవేశపెట్టారు. కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ నేతృత్వంలోని బృందం ఈ నివేదికను రూపొందించింది. భారత్ వృద్ధి రేటు పట్ల అంతర్జాతీయ రేటింగ్ సంస్థలు ఇస్తున్న నిరుత్సాహకర అంకెలను ప్రశ్నిస్తూ మరీ.. మనదేశానికి బ్రహ్మాండమైన వృద్ధిరేటు సాధ్యమని నివేదిక దృఢమైన విశ్వాసాన్ని వ్యక్తం చేసింది.

ఈసారి సర్వేలో అంకెలకే పరిమితంకాకుండా భిన్నకోణాలకనుగుణంగా వాటిని నిర్వచించేందుకు సర్వే ప్రయత్నించింది. రైలు ప్రయాణాల రద్దీ గణాంకాల ఆధారంగా వలసల వివరాలు చెప్పారు. పనుల కోసం ఏటా 90లక్షల మంది ఇలా వెళ్తున్నారట. 2011 జనాభా లెక్కల్లో చెప్పిన దానికన్నా ఇది దాదాపు రెట్టింపు. అలాగే ఆంధ్రప్రదేశ్‌కమొత్తానికీ ప్రత్యేక హోదాఇవ్వలేకపోతే ప్రత్యామ్నాయంగా లోక్‌సత్తా చెబుతున్న 'వెనకబడిన జిల్లాలకు (రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ సహా) హోదా' ప్రతిపాదనకు ఊతమిచ్చే ఇంకో అంశాన్ని సర్వే చెప్పింది. కేటాయింపుల్లో దేశంలోని వివిధ జిల్లాల మధ్య అసమతౌల్యం కొనసాగుతోందని తెలిపింది. పేదల సంఖ్య ఎక్కువగా ఉండే జిల్లాల్లో సామాజిక కార్యక్రమాలపై వెచ్చించే మొత్తాలు నానాటికీ గణనీయంగా తగ్గిపోతున్నాయి. బాగా వెనకబడిన 40శాతం జిల్లాలు కేవలం 29శాతం నిధుల్నే పొందుతున్నాయని చెప్పింది. అలాగే ఆర్థిక అంతరాలు పెరిగిపోవటం, ఆర్థిక ప్రజాస్వామ్యం కొరవడటం వంటి అంశాల్ని ప్రస్తావించింది.

**కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ సమర్పించిన ఆర్థిక సర్వే 2016-17 వివరాలు :**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ వృద్ధి రేటు 6.5శాతానికి పరిమితం కానున్నదని ఆర్థిక సర్వే వెల్లడించింది. పెద్ద నోట్ల రద్దుతో దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నదని, గడచిన ఆర్థిక సంవత్సరంలో నమోదైన 7.6శాతంతో

## కార్మిక, పన్ను సంస్కరణలు అవసరం

దుస్తులు, తోలు పరిశ్రమ రంగాల్లో ఉద్యోగాల సృష్టికి కార్మిక, పన్ను సంస్కరణల అవసరముందని సర్వే పేర్కొంది. ఈ రెండు రంగాలూ సామాజికంగా కూడా ప్రభావితం చూపుతాయి. అంతర్జాతీయ గిరాకీకి సంబంధం లేకుండా ఉన్న దేశీయ విధానాలను మార్చాల్సిన అవసరముందని, ఇది జరిగితేనే భారత్ నుంచి ఎగుమతుల్లో పోటీతత్వం పెరుగుతుందని వివరించింది. 'చైనాలో ఆయా రంగాల్లో వేతనాలు పెరిగినప్పటి నుంచి మన దుస్తులు, తోళ్ల పరిశ్రమల ఎగుమతులకు మంచి అవకాశం వచ్చింది. ఇప్పుడు మనం చేయాల్సిందల్లా కార్మిక, పన్ను సంస్కరణలను చేపట్టి అంతర్జాతీయంగా గట్టి పోటీ ఇవ్వటమే'నని సర్వే పేర్కొంది. భారత్‌లోని చాలా రాష్ట్రాల్లో తక్కువ వేతన వ్యయాలు ఉండటం వల్ల చైనా మార్కెట్ వాటాను అందిపుచ్చుకోవటానికి మంచి అవకాశమని సూచించింది.

పోలిస్తే ఒక శాతానికిపైగా పడిపోనున్నదని పార్లమెంటుకు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ సమర్పించిన 'ఆర్థిక సర్వే 2016-17' తెలిపింది. వృద్ధికి మరింత ఊతమివ్వాలంటే, వచ్చే ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో పన్నులను తొలగించాలని సూచించింది. 2017-18లో వృద్ధి రేటు 6.75 నుంచి 7.5శాతం మధ్యలో నమోదుకావచ్చని సర్వే ఆశాభావం వ్యక్తం చేసింది. కేవలం వ్యక్తిగత ఆదాయపన్ను తగ్గితే సరిపోదని, కార్పొరేట్ పన్నులతోపాటు అధిక ఆదాయం కలిగినవారిపై విధిస్తున్న పన్నుల్లోనూ కోత పెట్టాలని పేర్కొంది. అధిక ఆదాయం కలిగినవారంటే ఎవరో స్పష్టత మాత్రం ఇవ్వలేదు. అలాగే నోట్ల రద్దు ప్రభావాన్ని పూర్తిస్థాయిలో విశ్లేషించే ప్రయత్నం కూడా సర్వే చేయనప్పటికీ.. డీమానిటైజేషన్ వల్ల ప్రపంచదేశాల్లో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్న భారత్ ఆ స్థానాన్ని కోల్పోయే ప్రమాదముందని ఐఎంఎఫ్ హెచ్చరించిన విషయాన్ని ప్రస్తావించింది. నోట్ల రద్దు వల్ల దెబ్బతిన్న వృద్ధికి పునరుత్తేజం తేవటానికి వస్తు సేవల పన్ను (జీఎస్టీ), సంస్థాగత సంస్కరణలకు పెద్దపీట అవసరమని సూచించింది. నోట్ల రద్దు నేపథ్యంలో దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగంలో ధరలు భారీగా తగ్గాయని, కానీ దీర్ఘకాలికంగా మేలు జరుగుతుందని తెలిపింది. జీఎస్టీతో స్థిరాస్తి ధరలు మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని, జాతీయ రహదారులు, కార్గో, విద్యుత్తు రంగాలలో భారీ వృద్ధికి అవకాశముందన్నారు. ప్రభుత్వం సరైన సంస్కరణలు తీసుకుంటే వృద్ధి రేటు 8-10శాతం చేరుకునే అవకాశముందని వ్యాఖ్యానించింది.

### 4.1శాతానికి వ్యవసాయం

ప్రస్తుత సంవత్సరంలో వ్యవసాయ రంగం 4.1శాతం మేర వృద్ధిని నమోదు చేసుకోనున్నదని సర్వే వెల్లడించింది. 2015-16లో 1.2శాతమే. దేశవ్యాప్తంగా వర్షాలు అంచనాలకు మించి కురియడం ఇందుకు కారణమని తెలిపింది. పప్పుల ధరల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు

## 'పారా'నే పరిష్కారం

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మొండిబకాయిల (సుమారు రూ.10లక్షల కోట్లు దాకా ఉండొచ్చని అంచనా) సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒక ఆస్తుల పునర్నిర్మాణ కంపెనీ (పబ్లిక్ సెక్టార్ రీహాబిలిటేషన్ ఏజెన్సీ-పారా) ఏర్పాటు చేయాలని ఆర్థిక సర్వే సూచించింది. దాదాపు 13 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కనీసం 40శాతం రుణాలు తీవ్ర ఒత్తిడిలో ఉన్నాయని, ఇందులో 20శాతం మొండి బకాయిలు (ఎన్‌పీఏలు)గా ఉన్నాయని సర్వే వివరించింది. భారీ స్థాయిలో మొండి బకాయిల కారణంగా ఆదాయాలను ఆర్జించటంలో అవి తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నాయి. మరోవైపు కార్పొరేట్ల బ్యాలెన్స్ షీట్లు కూడా సవాళ్లు విసురుతున్నాయి. అటు బ్యాంకింగ్, ఇటు కార్పొరేట్ ద్వంద్వ బ్యాలెన్స్ షీట్లు (టీబీఎస్) సమస్యకూ పారానే పరిష్కారం చూపగలదని భావిస్తున్నట్టు సర్వే తెలిపింది.

## నల్లధనం 3 నుంచి 7.3లక్షల కోట్ల వరకు

ఆర్థికరంగంలో నల్లధనం 3లక్షల కోట్ల నుంచి 7.3లక్షల కోట్ల రూపాయల వరకు ఉండే అవకాశముందని సర్వే తెలిపింది. ఇతర దేశాల్లో చెలామణిలో పాడై చెల్లకుండా పోయే నోట్ల సంఖ్యను ఆధారం చేసుకుని మన ఆర్థికరంగంలో నల్లధనంపై ఉజ్జాయింపు అంచనా వేసే ప్రయత్నాన్ని సర్వే చేసింది.

## 'పేదలకు నేరుగా డబ్బు' స్కీమ్ (యూబీఐ)పై చర్చ జరపాలి

పేదరిక నిర్మూలన పథకాలు, సబ్సిడీలు అన్నింటినీ తొలగించి పేదలందరికీ తలాకొంత ఆదాయం (యూనివర్సల్ బేసిక్ ఇన్‌కం-యూబీఐ) ఇస్తే ఎలా ఉంటుందో చర్చించాలని సర్వే ఒక ప్రతిపాదన చేసింది. 'ప్రతి పౌరుని కన్నీరు తుడవాలి' అన్న మహాత్మాగాంధీ మాటల్ని ఈ సందర్భంగా ఉటంకించింది.

'యూబీఐ ఒక శక్తిమంతమైన భావన. దీని అమలుకు సమయం ఆసన్నం కాలేదేమోకానీ, దీనిపై చర్చించాల్సిన సమయం మాత్రం వచ్చింది' అని సర్వే నివేదిక పేర్కొంది. 'దీని అమలుకు మౌలికంగా అవసరమయ్యేవి జే ఏ ఎం.. అంటే జన్‌ధన్, ఆధార్, మొబైల్. వాటితోపాటే కార్యక్రమ వ్యయం పంపిణీపై కేంద్ర, రాష్ట్రాల మధ్య సంప్రదింపులు జరగాలి. పేదరికం 0.5శాతానికి తగ్గించేందుకు యూబీఐకి జీడీపీలో 4-5శాతం నిధులు అవసరం. ఇందులో పైనున్న 25శాతం అధికాదాయ వర్గాల్ని చేర్చకూడదు. అదే సమయంలో మధ్యతరగతికి ప్రస్తుతం ఇస్తున్న సబ్సిడీలు, ఆహారం, పెట్రోలియం, ఎరువులపై ప్రస్తుతం ఇస్తున్న మొత్తం జీడీపీలో 3శాతం వరకు ఉంటున్నది. స్వాతంత్ర్యం వచ్చే నాటికి 70శాతంగా ఉన్న పేదరికం 2011-12నాటికి 22శాతానికి తగ్గిందని (టెండూల్కర్ కమిటీ) గుర్తుచేసింది. ప్రతి పౌరుని కన్నీళ్లు తుడవటమంటే.. ఏదో నామమాత్రంగా కొంత శక్తిని సమకూర్చడంకన్నా ఇది చాలా పెద్ద విషయమే" అని సర్వే వివరించింది. భారత్‌లో ప్రత్యక్షంగా, పరోక్షంగా 950 సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. వాటిలో హేతుబద్ధతున్నా పరిమితులున్నాయి. యూబీఐ ద్వారా సాయం చేస్తే, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకం సహా అన్నీ రద్దవుతాయి. 2011 నుంచి కొన్ని గ్రామాలలో ప్రయోగాత్మకంగా దీన్ని అమలు చేస్తున్నారు. ఆ ప్రాంతాల్లో ఆహారంపై ప్రజలు చేస్తున్న ఖర్చు పెరిగిందని, సామాజిక, మానవ సూచికల్లో పెరుగుదల కనిపించిందని నివేదికలు చెబుతున్నాయి. సాంకేతికత, ఆటోమేషన్ వల్ల ఉద్యోగాలు పోతాయన్న ఆందోళనల నేపథ్యంలో యూబీఐ భావన గురించిన ఆలోచన మొదలైంది. ఫిన్లాండ్ దీన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తోంది. పలు ఇతర దేశాలు కూడా ఇదే అనుసరించే అవకాశముంది. భారత్ కూడా పరిశీలించాలని సర్వే సూచించింది.

తీసుకోవాలని, ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించింది. గతంలో పప్పుదినుసుల ధరలు భారీగా పెరగడంతో సామాన్యుడిపై అధికభారం పడిన అంశాన్ని సర్వే ప్రస్తావించింది. దేశవ్యాప్తంగా నెలకొన్న తీవ్ర నగదు కొరత వ్యవసాయోత్పత్తుల సరఫరా, ధరలపై తీవ్ర ప్రభావం చూపాయి.

### ఎఫ్‌డీఐలను ఇంకా ఆకర్షించాలి

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను ఆకట్టుకోవటానికి సంస్కరణలపై మరింత దృష్టి సారించాల్సిన అవసరముందని సర్వే తెలిపింది. రక్షణ సహా రైల్వే, మౌలిక, నిర్మాణ, ఫార్మా రంగాలలో కేంద్రం ఇప్పటికే ఎఫ్‌డీఐలకు గేట్లు బార్లా తెరిచిన సంగతి తెలిసిందే.

### అంతర్జాతీయ వ్యవహారాలను ఓ కంట కనిపెడుతుండాలి

రిజర్వు బ్యాంకు గవర్నర్ నియామకం చుట్టూ వివాదాలతో పాటు బ్రెగ్జిట్, అమెరికా అధ్యక్ష ఎన్నికలు, ఫెడ్ విధానం వంటివి మన స్టాక్ మార్కెట్ మీద, ఇతరత్రా ప్రభావం చూపాయి. అమెరికా సహా వివిధ దేశాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై భారత్ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సర్వే సూచించింది. ముఖ్యంగా చైనా పట్ల నజర్ ఉండాలంది.

### వందమంది ఓటర్లలో ఏడుగురే పన్ను కడుతున్నారు

దేశవ్యాప్తంగా ప్రతి వందమంది ఓటర్లలో కేవలం ఏడుగురు పన్ను కడుతున్నారని సర్వే తెలిపింది. ఈ పరిధిని మరింత పెంచాలంది. జీ-20లో పన్ను చెల్లించే దేశాల్లో భారత్ 13వ స్థానంలో నిలిచింది.

### ఐదు శాతం పెరిగిన సబ్సిడీ బిల్లులు

ఏప్రిల్ - నవంబర్ మధ్యకాలంలో సబ్సిడీ బిల్లుల చెల్లింపులు ఏడాది ప్రాతిపదికన ఐదు శాతం పెరిగాయని సర్వే తెలిపింది. ఆహారపదార్థాలపై 21.6శాతం సబ్సిడీ ఇవ్వడం వల్లే బిల్లులు పెరిగాయని వెల్లడించింది. పెట్రోలియం ఉత్పత్తులపై రూ. 2.31లక్షల కోట్ల సబ్సిడీ చెల్లింపులు జరపగా, ఆహార సబ్సిడీ కోసం రూ. 1.39లక్షల కోట్లు, ఎరువులకు రూ. 70వేల కోట్లు, పెట్రోలియం కోసం రూ. 26వేల కోట్లు చెల్లింపులు జరిపారు.



## ఆర్థిక సర్వే విశ్వసనీయంగా ఉంది, విపక్షం కూడా విడుదల చేయటం అభినందనీయం: జేపీ

ఆర్థిక సర్వే నిజాయతీ, విశ్వసనీయతలతో ఉంది. మొండిబకాయిలు 12శాతం అంటున్నారుగానీ వాస్తవానికి 20శాతందాకా ఉండొచ్చని అంచనా. ఉద్యోగ సంక్షోభాన్ని, ద్వంద్వ బ్యాలెన్స్ షీట్ (టీబీఎస్) సంక్షోభాన్నీ ఎల్లకాలం దాటవేయలేం. ఒకరి మీద ఒకరు బురద జల్లుకోవటం కాకుండా నిజాయతీగా, కొత్తగా ఆలోచించి పరిష్కారాలను సాధించాలి. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కూడా మరో ఆర్థిక సర్వేను విడుదల చేయటం మంచి పరిణామం. ఏఐసీసీని, రాజీవ్ గౌడను ఇందుకు అభినందించాలి. ప్రతిపక్షాలు ఇలా ప్రత్యామ్నాయ ఆర్థిక సర్వేల్ని విడుదల చేయటాన్ని ఓ సంప్రదాయంగా కొనసాగించాలి. సాక్ష్యాలు, ఆధారాలతో ఇలా పార్టీలు పోరాటం చేస్తే.. పార్టీలకు రాజకీయ లబ్ధి చేకూరుతుంది, ప్రజలకూ మేలు జరుగుంది.

### ద్రవ్యోల్బణం 5శాతం దిగువనే, కానీ..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం ఐదు శాతం దిగువకే పరిమితం కానుందని సర్వే తెలిపింది. దేశ ఆర్థిక పరిస్థితులు నిలకడగా నమోదవటం, ధరలు అదుపులో ఉండటంతో గణాంకాలు నిర్దేశించిన మేరకే ఉండొచ్చని అభిప్రాయపడింది. అలాగే అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు పెరుగుతుండటం, వాణిజ్యరంగంలో నెలకొన్న ఉద్రిక్తతలు వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని సర్వే పేర్కొంది. ఇంధన ధరల పెరుగుదల వల్ల ద్రవ్యోల్బణం ఎగబాకే అవకాశముందని తెలిపింది.

### ఉపాధ్యాయులకు బయోమెట్రిక్

ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు శాతం తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో సర్వే.. బయోమెట్రిక్ ప్రతిపాదన చేసింది. దీని ద్వారా హాజరును మెరుపరచవచ్చని, ఈ విధానాన్ని ప్రాంతీయ కమ్యూనిటీతోపాటు కుటుంబ సభ్యుల పరిశీలనలో ఉంచాలని పేర్కొంది. ప్రాథమిక పాఠశాలల్లో బోధనలో నాణ్యతా ప్రమాణాలు లేవని, కొందరు ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యమున్నా సరిగా బోధించటం లేదని సర్వే విమర్శించింది.

### పీఎంజీకేవై నిధులను పథకాలకు ఉపయోగించొద్దు

నల్లధన ప్రకటనకు మరో అవకాశంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన పథకం కింద సమకూరే డబ్బును ప్రభుత్వ పథకాలకు ఉపయోగించకూడదు. శాశ్వత ఆస్తుల సృష్టికి, రుణాలు తీర్చడానికి ఆ సొమ్మును ఉపయోగించాలని సర్వే సూచించింది.

### ప్రైవేటీకరణపై గుంజులాట వద్దు

పీకల్లోతు నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను అంతర్జాతీయ సంస్థలుగా తీర్చిదిద్దే అర్థం లేని కార్యక్రమానికి స్వస్తి చెప్పి ప్రైవేటుపరం చేయటం మేలు.

### ఎఫ్ఆర్బీఎంను సవరించాలి

ఎప్పుడో 13 సంవత్సరాల క్రితం అప్పటి అవసరాలకు అనుగుణంగా రూపొందించిన 'ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ' (ఎఫ్ఆర్బీఎం) చట్టాన్ని ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా సవరించాలి. రేపటి భారత ఆర్థిక అవసరాలకు అనుగుణంగా ద్రవ్యలోటును మార్చుకునేందుకు వీలుగా ఈ చట్టం ఉండాలి. సంపన్న దేశాల విధానాలు మనకు సరిపడవు.

### సర్వేలోని ఇంకొన్ని ముఖ్యాంశాలు :

- స్టాంప్ డ్యూటీని తగ్గించాలి
- నల్లధన సృష్టికి కారణమవుతున్న స్థిరాస్తులను కూడా జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలి
- పారిశ్రామిక రంగ వృద్ధి 5.2శాతానికి పరిమితం కావచ్చు. గతేడాది 7.4శాతంగా ఉంది
- పారిశ్రామిక రాయితీల్ని సమర్థవంతంగా వినియోగించుకోకపోవటం వల్ల ప్రత్యేక హోదా ఉన్నా కొన్ని రాష్ట్రాలు వెనకబడ్డాయి
- గృహాల ధరలు తగ్గిన నేపథ్యంలో మధ్యతరగతి వర్గాలకు చౌక ఇళ్లను నిర్మించి ఇవ్వాలి
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 0.3శాతానికి కరెంటు ఖాతా లోటు ✦

# ఆన్‌లైన్ 'ఆందోళనా' గళాల్ని గౌరవించాలి!

**జ**ల్లికట్టు నిషేధానికి వ్యతిరేకంగా తమిళనాడులో ఆందోళన విజయవంతం కావటంతో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆ తరహా ఉద్యమం రావచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఊహించారు. కేబినెట్ సమావేశంలో పిచ్చాపాటిగా మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యానం చేశారు. ఇది అనధికార సమాచారమే అయినా ఇందులో పెద్దగా సందేహపడాల్సిన పని లేదు. రాజకీయాలలో థర్టీ ఇయర్స్ ప్లస్ అనుభవముంది కాబట్టి ఆందోళనల వాసనను ముందుగానే పసిగట్టగల రాయన. అయితే ఆయన ఊహించనది.. జల్లికట్టు వచ్చి వచ్చి ప్రత్యేక హోదా అంశాన్ని చుట్టుకుంటుందని! హోదా తప్ప మిగిలిన అంశాల మీదే ప్రతిపక్షాల దృష్టి ఉండాలని రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలవారు కొంతకాలంగా తెగ మొక్కుకుంటు న్నారు. ప్రాచుర్య మీడియా సాయంతో ప్రత్యేక ప్యాకేజీని మసిపూసి మారేడుకాయ చేసి ప్రత్యేక హోదా అంశాన్ని వెనక్కి నెట్టగలిగారు. ఈలోగా పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) రావటంతో హమ్మయ్య అని ఊపిరిపీల్చుకున్నారు. అయితే, అనుకోకుండా జల్లికట్టు.. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదాకు కనెక్ట్ అయింది. చెన్నై బీచ్‌లో జరిగిన జల్లికట్టు ఆందోళన తరహాలో ఏపీ ప్రత్యేక హోదా కోసం విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో ఆందోళనకు ఆన్‌లైన్ (సోషల్ మీడియా/నెట్‌వర్క్) వేదిక ద్వారా యువత ప్రణాళిక వేసుకున్నారు. ఒకరకంగా ప్రత్యేకహోదా 2.0 కార్యక్రమమిది! వామపక్షాలు, జనసేన, వైసీపీ, కాంగ్రెస్, లోక్‌సత్తా.. ఇలా బీజేపీ, తెలుగుదేశం తప్ప దాదాపు అన్ని రాజకీయ పార్టీలు, కొందరు సినిమా తారలు, ప్రముఖులు మద్దతు పలికారు. జనసేన వ్యవస్థాపకుడు, సినీ హీరో పవన్ కళ్యాణ్ తన ట్వీట్లు ద్వారా ఈ కార్యక్రమానికి కొత్త ఊపునివ్వటంతో ఖంగుతిన్న చంద్రబాబు.. నెటిజన్ల సోషల్ మీడియా ఉద్యమాన్ని కుట్రపూరితం, అరాచకమయం, ప్రమాదకరం అంటూ కించపరిచే ప్రయత్నం చేశారు. నగదు రహిత ఆర్థిక వ్యవస్థ దిశగా నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రుల కమిటీకి నేతృత్వం వహించి డిజిటల్ ఆర్థిక వ్యవస్థ కోసం 55 రోజుల్లో మధ్యంతర నివేదిక ఇవ్వగలిగానని సగర్వంగా చెప్పుకుంటూనే.. అదే ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా యువత చేస్తున్న ఆందోళనను అగౌరవపరిచే ప్రయత్నం చేశారు. అధికారబలంతో అడ్డుకోవ టానికి, అణగదొక్కటానికి సర్వశక్తులూ ఒడ్డారు. జన్ లోక్‌పాల్ కోసం, నిర్భయ ఉదంతంలో ఇదే తరహాలో ఆందోళనలు జరిగాయని, వాటిని తాము సమర్థించామని ఆయన విస్మరించారు. సోషల్ మీడియా ద్వారా విశాఖ బీచ్‌లో ఉద్యమం.. చంద్రబాబులోనే కాదు, చాలామంది సాంప్రదాయ రాజకీయ నాయకులలో కూడా ఆందోళన కలిగించింది. విశాఖలోని అటువంటి కొందరు నాయకులైతే.. నగరాన్ని నాశనం చేయటానికి కుట్రతో వస్తున్న సోషల్ మీడియా ఆందోళనకారులను చూస్తూ ఊరుకోమని, ఎదుర్కొంటామని హూంకరించారు. అయ్యా! విశాఖ బీచ్‌లో ఆందోళనలు చేసే వారు విదేశాల నుంచి వస్తున్న ఉగ్రవాదులా? లేక వారు ఎంచుకున్న అంశం రాజ్యాంగ విరుద్ధమైనదా? లేక హింసామార్గంలో ఆందోళన చేస్తామంటున్నారా? ఇవేవీ లేవు గదా! జన్ లోక్‌పాల్, నిర్భయ ఉదంతం, జల్లికట్టు ఆందోళన చేసిన ఇలాంటి యువత ఢిల్లీ, ముంబయి, చెన్నై నగరాల్ని నాశనం చేయలేదు గదా! పైగా, విశాఖ నగరం, ఆ చుట్టుపక్కల జిల్లాల నుంచే ఎక్కువగా విశాఖబీచ్‌కి ఈ యువత వస్తున్నారు. విశాఖ నగరాన్నిగానీ, ఆ మాటకొస్తే తెలంగాణని గానీ, మరో ప్రాంతాన్నిగానీ దెబ్బతీసింది, దగా చేసింది ఆ ప్రాంతంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు, వారి పార్టీల రాజకీయ సంస్కృతి, విధానాలే తప్ప అక్కడ ఉంటున్న ప్రజానీకం కాదు, ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే యువతా కాదు. అవాంఛనీయ శక్తులు తలెత్తకుండా జాగ్రత్త తీసుకోవాల్సింది పోలీసులు. చట్టబద్ధ పాలన అమలు సక్రమంగా చేయకుండా, ఇది ప్రభుత్వ తొలి బాధ్యత అనుకోకుండా, పోలీసులు సక్రమంగా స్పందించి శాంతిభద్రతలు కల్పిస్తారనే మాటను కూడా ఎన్నికల మేనిఫెస్టోల్లో చేర్చే ఘనమైన దేశం కాబట్టి.. బందోబస్తు చేయటాన్ని పెద్ద సమస్యగానే చూస్తున్నాం.



.. ఈ వాస్తవాల్ని పక్కదోవ పట్టించే ప్రయత్నంతోపాటు జగన్, పవన్ కళ్యాణ్, జయప్రకాష్ నారాయణ్ హైదరాబాద్ నుంచి మాట్లాడుతున్నారని కూడా విచిత్రమైన వాదనల్ని కొందరు వినిపించారు. ఆంధ్ర ప్రాంతంలో తనకు ఓట్లు, సీట్లు రాకపోయినా, అవి పొందిన

## 'స్థానిక' సాధికారత ఉంటే.. 'సోషల్' యూత్ యాక్షన్ హీరోలవుతారు

యువత సోషల్ మీడియాలో చాలా సందర్భాల్లో సానుకూలంగానే స్పందిస్తున్నారు. ఏవైనా ప్రమాదకర ఘటనలు, ఆందోళనకర పరిస్థితులు ఉన్నప్పుడు ఫోటోలు తీసుకోవటానికి, సమాచారం పోస్ట్ చేయటానికే పరిమితమవుతున్నారన్న విమర్శలను అన్ని వేళలా ఒప్పుకోలేం. సమాచారం పెడితే వేరేవాళ్లు స్పందిస్తారని వారు భావిస్తుండవచ్చు. దానికి కారణం మన వ్యవస్థ. మన వ్యవస్థలో ఎన్నికల్లో గెలిచినవారు తప్ప మిగిలినవారు సమస్యల పరిష్కారంలో ఏం చేయాలో తెలీని పరిస్థితి నెలకొంది. అలాంటి కేంద్రీకృత వ్యవస్థను నిర్మించుకున్నాం. అధికారాన్ని వికేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేసి, వార్డు స్థాయి వరకూ నిధులు అధికారాలు ఉంటే.. స్థానికంగా యువత కేవలం పోస్టలకే పరిమితంకాకుండా, సమస్యల పరిష్కారంలో ప్రత్యక్షంగా భాగస్వాములవుతారు. యువతలో పౌరసత్వం, నాయకత్వం పెరిగి దేశంలోని శక్తిసామర్థ్యాలు పూర్తిగా వికసిస్తాయి. దేశ సుస్థిరాభివృద్ధి అనేది – ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల వరాల కోసం ఎదురుచూసే యువత వల్ల సాధ్యమవుతుందా? తమ శక్తిసామర్థ్యాల్ని పూర్తిగా వికసింపచేసుకుని పాలనలో భాగస్వాములైన యువత వల్ల సాధ్యమవుతుందా? – రాజకీయాన్ని, పాలనను ఎన్నికలకే పరిమితం చేయకుండా ఎక్కడికక్కడ ప్రజలు, ముఖ్యంగా యువత భాగస్వామ్యం ఉండేలా వికేంద్రీకరించటం అవసరమని సోషల్ మీడియా విస్తరణ మరింత గట్టిగా చెబుతోంది.

పార్టీలు పలాయనం చిత్తగించినా.. రాష్ట్ర విభజన సమయంలో ప్రాంతాలకతీతంగా వ్యవహరించిందీ, హైదరాబాద్ ఆదాయాన్ని కోల్పోయే ఆంధ్రప్రదేశ్ ఆర్థిక భవిష్యత్తును పరిరక్షించటానికి మొదటగా ఏపీకి ప్రత్యేక హోదా ప్రతిపాదన చేసిందీ లోక్‌సత్తా జేపీయేనన్న స్పృహ కూడా వారిలో కొరవడటం బాధాకరం. పేదరికాన్ని పెంచే విధానాలు, ప్రజల మధ్య చిచ్చుపెట్టే రాజకీయం, కృత్రిమ బహిరంగ సభల రాజకీయంతో మనుగడ సాగిస్తున్న తమ గుప్పెట్లో నుంచి రాజకీయం చేజారిపోతుందన్న భయంతోనే ఈ సాంప్రదాయ నాయకులు సోషల్ మీడియా ఆందోళనా పద్ధతి మీద విరుచుకు పడుతున్నారు. ప్రత్యేక ప్యాకేజీ పేరుతో మోసం చేస్తూ ప్రత్యేక హోదాకి గండికొట్టే ప్రయత్నాలు చేస్తుంటే మౌనం వహించిన తాము బీచ్‌లో యువత ఆందోళనను ప్రశ్నించటం ఏం సబబో వారే ఆలోచించుకోవాలి.


***ఓటుకు కోట్లు కేసులో నా పోలీస్, నా ఏసీబీ అన్న చంద్రబాబు.. ఈ ఉద్యమాన్ని అణచివేయటానికి పోలీసు వ్యవస్థను అదే తరహాలో దుర్వినియోగం చేశారు.*** విశాఖ బీచ్‌లో ఆందోళనకు ఎవరు బాధ్యత తీసుకుంటారో చెబితేనే పర్మిషన్ ఇస్తామని చెప్పిన పోలీసువారు.. ఆ తర్వాత కొందరు



లిఖితపూర్వక హామీ ఇచ్చినా పర్మిషన్‌ని నిరాకరించారు. విశాఖలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనల్ని అడ్డుకున్నారు. గణతంత్ర దినోత్సవం రోజున, పెట్టుబడి సదస్సు జరగటానికి ముందురోజున ఇలాంటి ఆందోళన జరపటం గర్హనీయమని చంద్రబాబు అన్నారు. "ముఖ్యమంత్రి గారూ! గణతంత్ర దినోత్సవమంటే రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు. స్వేచ్ఛకు పట్టం గడుతూ రాజ్యాంగం ఇచ్చిన హామీని ఆచరణలో చూపితే, మొక్కుబడిగా జెండావందనాల కంటే ఘనంగా గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకున్నట్టయ్యేది. మరోవైపు, యువ ఉద్యమకారులు చేస్తున్న ప్రత్యేక హోదా ఉద్యమం వల్ల పెట్టుబడిదారులకు లాభమే గదా! అయినా భయముంటే – ఈ మౌన నిరసన కార్యక్రమానికి నాయకత్వం వహించమని మిమ్మల్ని కూడా ఆహ్వానించారు కాబట్టి, మీరే వచ్చి నాయకత్వం వహించాల్సింది. బీచ్ ఆందోళనకారులు కేంద్రం తీరుకి నిరసనగా తప్ప రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రదర్శన చేస్తున్నట్టు చెప్పారు. అయినా అనుమానముంటే – ఆందోళన సమయాన్ని కొన్ని గంటలకు కుదించటమో, మరోరోజు చేసుకోమని చెప్పటమో చేసుండాల్సింది. అంతేతప్ప, ప్రత్యేక హోదా కంటే ప్రత్యేక ప్యాకేజీ గొప్పదని, ఆందోళనలు చేసేవారు విశాఖ నగరాన్ని తగలబెట్టటానికి, రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను అడ్డుకోవటానికి ప్రయత్నిస్తున్నారని నిందించటం నియంతృత్వమవుతుంది. మీరు అమెరికా గురించి గొప్పగా చెబుతుంటారు. కానీ ప్రపంచంలోనే అతి శక్తిమంతమైన ***అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగే రోజున కూడా ఆందోళనలకు అనుమతించారని మాత్రం (ఈ ఆందోళనకారుల్లో చాలామంది స్వచ్ఛందంగా వచ్చి గుమిగూడారు) గుర్తించరు.*** ట్రంప్ తప్పుచేసినా అడ్డుకోవటానికి అక్కడ అనేక ఏర్పాట్లున్నాయని, వికేంద్రీకరణతో స్థానిక ప్రభుత్వాలు అక్కడ బలంగా ఉన్నాయని మాత్రం తెలియనట్టు నటిస్తూ

అధికారమంతా మీ గుప్పెట్లోనే పెట్టుకుంటారు".

***రాష్ట్రాన్ని ఏకపక్షంగా విడగొట్టారని, ఎవరినీ సంప్రదించలేదని తరచూ చెప్పే చంద్రబాబు.. ఇప్పుడు ప్రత్యేక హోదా విషయంలో తాను కూడా అదే రీతిలో వ్యవహరిస్తున్నారు.*** ఈ అంశంపై ఎప్పుడూ అఖిలపక్ష సమావేశం నిర్వహించే ప్రయత్నం చేయలేదు. హోదాలో పన్ను రాయితీలు భాగం కావని దబాయిస్తున్నారు గానీ, పన్ను రాయితీలు లేనప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత ఎందుకు కేంద్రానికి లేఖ రాశారు అన్న ఆలోచనే చేయలేదు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వటానికి తమకు అభ్యంతరం లేదుగానీ, ఆ రాష్ట్రానికి ఇచ్చే పారిశ్రామిక రాయితీల వల్ల తమకు నష్టం లేకుండా చూడాలని ఆమె తన లేఖలో కోరారు. అలా ఇతర రాష్ట్రాలకు ఇబ్బంది లేకుండా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని చంద్రబాబు కేంద్రాన్ని ఎన్నడూ కోరిన దాఖలాలు లేవు. నాకంటే సీనియర్లు దేశంలోనే లేరనే బాబు.. హోదాపై ఇతర రాష్ట్రాలను ఒప్పించేందుకు కనీస ప్రయత్నం చేయలేదు. హోదాను రప్పించుకోవటానికి నిపుణులతో, ఆర్థికవేత్తలతో చర్చించే ప్రయత్నం చేయలేదు. కనీసం ప్రత్యేక హోదా ఇవ్వటానికి ఉన్న సమస్యలేవో ప్రజలకు చెప్పటం, హేతుబద్ధ ప్రత్యామ్నా యాలు చూపించటం వంటి ప్రజాస్వామిక ప్రయత్నాలే లేవు. అంతా తమ సొంత వ్యవహారమన్నట్టు చంద్రబాబు, కేంద్రమంత్రులు వ్యవహ రిస్తున్నారు. ఎన్నికలప్పుడు హోదా సంజీవని అని చెప్పి, ఇప్పుడు రాయితీలు లేని ప్యాకేజీయే గొప్ప అంటున్నారు. రాష్ట్ర విభజన చేయాలని లేఖ ఇచ్చిన మీరు.. విభజన జరిగితే హైదరాబాద్ లేకపోవటం వల్ల నష్టపోయే ఆంధ్రప్రదేశ్‌కి ఏం కావాలో ఎప్పుడైనా చెప్పారా చంద్రబాబూ? విభజన అనివార్య మైనప్పుడు కూడా ఏపీలో ప్రత్యేక హోదా ప్రతిపాదన అసెంబ్లీలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చేసిన నెల రోజుల తర్వాత కేంద్రంలో కాంగ్రెస్, బీజేపీ సహకరించి హోదా ఇస్తామని పార్లమెంటులో ప్రధాని ప్రకటన చేశారు. నూతన ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ఏర్పడ్డా హోదా రాకపోవటంతో లోక్‌సత్తా 2014 చివరి నుంచీ 'తెలుగు భవిత' పేరుతో దీక్షలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించింది. ప్రత్యేక హోదా, పోలవరం, జాతీయ సంస్థల ఏర్పాటు, రెవెన్యూ లోటు కోసం




ముఖ్యమంత్రి చంద్రబాబునే నాయకత్వం వహించాలని కోరింది. అప్పటికి ప్రణాళికా సంఘం ఇంకా కొనసాగుతోంది. అయినా రాష్ట్ర ప్రభుత్వం మేలుకోలేదు. పదేపదే డిమాండ్ చేస్తుంటే, రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలను వదిలేసి కేవలం రాజధాని అమరావతి ప్రాంతానికి (మొత్తం జిల్లాకు కూడా కాదు) మాత్రమే రాయితీలు అడిగారు.

***ఆరు నెలల క్రితం వరకూ తెలుగుదేశం వారే స్వయంగా ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలిచ్చారు. ఇప్పుడు మాత్రం ఆ మాటంటే యువతను దోషుల్లా చూస్తున్నారు.*** పవన్ కళ్యాణ్ ద్వారా ఓట్లు పొంది గెలిచిన తెలుగుదేశం ప్రభుత్వం ఆయన మద్దతిచ్చిన న్యాయబద్ధమైన హోదా డిమాండ్‌ను మాత్రం పట్టించుకోలేదు. పెద్ద నోట్ల రద్దుపై ఏ వ్యక్తినీ దూషించకుండా, ఏ పార్టీ మీదా దుమ్మెత్తిపోయకుండా హేతుబద్ధంగా ఆరు నిముషాలు మాట్లాడి మాజీ ప్రధాని డా॥ మన్మోహన్ సింగ్ మోదీ ప్రభుత్వాన్ని దిమ్మెరపోయేలా చేశారు. తెలుగు రాష్ట్రాల కోసం పనిచేయగల అలాంటి పార్లమెంటు సభ్యుల్ని గెలిపించటంలో తాను విఫలమవటం కూడా ప్రస్తుత పరిస్థితికి ఒక కారణమని, అమృత బీజాలు నాటితేనే అమృత ఫలాలు వస్తాయని పవన్ కళ్యాణ్ ఇప్పటికైనా గుర్తించాలి. సమర్థులు, నిజాయతీ పరులు ఎన్నికవ్వలేని మన వ్యవస్థలో తగిన ఎన్నికల సంస్కరణలు వచ్చేవరకూ సరైనవారు కొంత మందైనా ఎన్నికయ్యేందుకు పవన్‌లాంటి వాళ్లు తమకున్న జనాకర్షక శక్తిని, చిత్తశుద్ధిని వినియోగిస్తూనే ఉండాలి.

***చంద్రబాబు తన మొండి వైఖరిని వీడి యువత న్యాయమైన డిమాండ్ పట్ల సానుకూలంగా స్పందించాలి.*** చట్టంలో చేర్చినా, చేర్చకపోయినా పార్లమెంటులో ప్రతిపక్ష బీజేపీ మద్దతుతో నాటి ప్రధాని చేసిన హోదా హామీ ప్రకటనను అమలుచేయటం ఫెడరల్ ప్రజాస్వామ్యానికి ఎంత అవసరమో కేంద్రానికి తెలియచెప్పాలి. ఇందుకు తెలంగాణ సహా ఇతర రాష్ట్రాల మద్దతును సమీకరించాలి. ఆంధ్రప్రదేశ్ మొత్తానికీ ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యంకాదంటే.. ***లోక్‌సత్తా ఇప్పటికే సూచించినట్టు రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ సహా దేశంలోని బాగా వెనకబడిన 80-100 జిల్లాలకు ప్రత్యేక హోదా ఇచ్చేట్టుగా ఒప్పించాలి.*** ఇందుకు ఇతర రాష్ట్రాలు కూడా మద్దతు పలుకుతాయనటంలో సందేహం లేదు. కేంద్రం రెవెన్యూలోటును ఆంధ్రప్రదేశ్‌కు పూడుస్తోంది, జాతీయ సంస్థల్ని కూడా ఏర్పాటు చేస్తోంది. ఇందులో ఏపీకి ప్రత్యేకించి చేస్తున్నది, విభజన చట్టంలో లేనిదీ ఏమీ లేదు. మిగిలిన రాష్ట్రాల కంటే ప్రత్యేకంగా ఏపీకి సాయం చేస్తున్నామన్న

మాట శుద్ధ అబద్ధం. హోదా లేకుండా పారిశ్రామిక రాయితీలు రావు. దీని మీద చర్చకు మేం రెడీ. సమర్థ నిర్వహణ సామర్థ్యం లేక ప్రత్యేకహోదా రాయితీలు అందుకుంటున్న రాష్ట్రాలు అభివృద్ధి చెందలేదు కాబట్టి.. మనకూ హోదా రాయితీలు అక్కర్లేదని కొందరు చేస్తున్న వాదనలో పరిజ్ఞానం మాట అలా వుంచి, కామన్‌సెన్స్ కూడా లేదు. డబ్బున్న వారెవరో సరిగా ఉపయోగించుకోలేక అభివృద్ధి చెందలేదు కాబట్టి, నాకు డబ్బు అక్కర్లేదు అని మెడ మీద తలకాయ ఉన్నవారెవరూ అనరు. రాయితీలు అక్కర్లేదంటే.. అదే మాట శ్వేతపత్రం ప్రకటించి చెప్పండి. రాయితీల చుట్టూ చేస్తున్న భూపందేరం, ఏపీ పారిశ్రామిక విధానం, దావోస్ పర్యటనలు, పెట్టుబడి దారీ సదస్సులు ఇవన్నీ ఎందుకో వివరణ ఇవ్వండి. ప్రజలే నిర్ణయించు కుంటారు.

***ట్విట్టర్ లేకపోతే డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికవుతారా అనేది సందేహాస్పదమే. కానీ ట్విట్టర్ మూలంగానే అలాంటి అధ్యక్షుడు ఎన్నికవలేదు.*** సోషల్ మీడియాలో అపరిపక్వత, అతి సంక్షిప్తత, ప్రమాదకర ధోరణుల పాళ్లు ఎక్కువగా ఉంటాయన్న మాటను కొట్టిపారేయలేం. కాస్త అటూఇటుగా ఓటు వేసే వయసు వాళ్లే అక్కడా భావాల్ని వెదజల్లేది. 'సరైనవాళ్లకు, మంచి పార్టీలకు వేస్తున్నారా లేదా' అని వాళ్లు ఓటు వేసే సమయంలో లేని ఆందోళన ఇప్పుడు అనవసరం. ఓట్లు సరిగా వేయకపోతే కష్టనష్టాలను భరిస్తున్నట్టే.. ఇలాంటి సమయాల్లోనూ భరిస్తుండాలి. మన ప్రాచుర్య మీడియా దగ్గర్నుంచి రాజకీయ నేతలు, సమాజం వరకూ మెజారిటీ ప్రజల సమస్యలను సకాలంలో గుర్తించి స్పందించలేకపోవటం వల్ల, పరిష్కారాలను చూపకపోవటం వల్ల, అధికారాన్ని వికేంద్రీకరించి ప్రజల్ని పాలనలో భాగస్వాముల్ని చేయకపోవటం వల్ల, ప్రజల పరిణతిని, ఆదాయాన్ని పెంచేందుకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించకపోవటం వల్ల బైట ఉన్నట్టే సోషల్ మీడియాలో కూడా అపరిపక్వ ధోరణులు సమస్యగా ఉన్నాయి. తీవ్రతలో కొంత తేడా ఉండొచ్చంతే. దీనికితోడు ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టేవారు (ట్రోల్స్), తప్పుడు వాదనలు, గందరగోళాలతో పక్కదోవ పట్టించేవారు ఉంటారు. అయినా.. హేతుబద్ధ పరిష్కారాలు, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేసే రాజకీయం, నియంత్రణా పద్ధతుల ఏర్పాటుతో అధిగమించటమొక్కటే మార్గం తప్ప సోషల్ మీడియాను, పిటిషన్లు, అప్పీళ్లు, యూట్యూబ్ వంటి ఇతర ఆన్‌లైన్ పద్ధతుల్ని తోసిపుచ్చటం కాదు.

***ప్రజలు చౌకగా, తేలిగ్గా, సూటిగా భావాల్ని వ్యక్తం చేయటానికి, తోటివారిని సమీకరించటానికి సోషల్ మీడియా వంటి ఆన్‌లైన్ పద్ధతుల్ని మించినవి లేవు.*** ఆఫ్‌లైన్ పద్ధతుల కంటే ఇవి చాలా ప్రత్యేక స్వభావం కలిగినవి. బలహీనతలతో పోటీపడుతూ ప్రభావం చూపగలిగేవి. రాజకీయ వ్యవస్థ, సమాజం కూడా సోషల్ మీడియాలో యువత ఆందోళనల్ని తక్కువ చేయకుండా ఇతర మాధ్యమాలతో, క్షేత్రస్థాయి కార్యక్రమాలతో వీటిని అనుసంధానం చేస్తూ (కన్వర్జెన్స్) రోజువారీ జీవితంలో సానుకూల భాగంగా మార్చే ప్రయత్నం చేయాలి. వ్యక్తిగత అంశాలలో ఎలా స్పందించినా.. ఉమ్మడి అవసరాలకు సంబంధించి కచ్చితంగా హేతుబద్ధత, బహిరంగ చర్చ ప్రమాణాలను పాటించటాన్ని ఆన్‌లైన్‌లో ఒక సంస్కృతిగా మార్చాలి. రాజకీయంలో, సమాజంలో, రోజువారీ ఇతరత్రా పనుల్లో మన ఆచరణ ఇదే రీతిగా ఉంటే.. నెట్‌లో తేలిగ్గా ఈ రకమైన మార్పుని తీసుకురావచ్చు.

ఆన్‌లైన్ ఓటింగ్ కోసం ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో.. ప్రజాభిప్రాయం ముఖ్యంగానీ, అది సోషల్ మీడియాలోనా? బయట ఒకేచోట అందరూ గుమిగూడా? అనేది అన్ని వేళలా పెద్ద సమస్య కాదు. నెటిజన్లూ సిటిజన్లే.

***అలాగే, జల్లికట్టు స్ఫూర్తితో ప్రత్యేక హోదాపై చైతన్యం తేవటం వరకూ ఓకే. ఆ ఆందోళనను ప్రభుత్వం అణచివేసినా ఇప్పటికే ఆ లక్ష్యం నెరవేరింది. కానీ జల్లికట్టులా ఒక రాష్ట్రం పరిధిలో పరిష్కారమయ్యే అంశం కాదు హోదా.*** ఇతర రాష్ట్రాలతో కలిసికట్టుగా కేంద్రం నుంచి సాధించుకోవాల్సిన డిమాండ్ ఇది. అందువల్ల యువత శాంతియుతంగా, సృజనాత్మక ఒత్తిడితో తమ ఆందోళనల్ని కొనసాగిస్తూనే రాజకీయ పరిష్కారం సాధించేందుకు నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి. బడ్జెట్ సమావేశాలలో కొంత స్పష్టత వస్తుంది. చంద్రబాబు ప్రభుత్వం పరిష్కారం కోసం ముందుకురాకుండా ప్యాకేజీకే పరిమితమై అణచివేతనే అనుసరిస్తే.. ఇతర రాజకీయ శక్తులు, పౌరసమాజం, యువత కలసికట్టుగా సంయమనంతో తమ కృషి కొనసాగించాలి. ఎటువంటి ప్రజాసేవ నేపథ్యం, సామర్థ్యం లేకున్నా కేంద్ర మంత్రులు, ఎంపీల స్థాయికి ఎదిగిన వ్యాపార, ముఠా రాజకీయ నేతల ప్రయోజనాలు, డబ్బు రాజకీయాలు ముఖ్యమా? రాష్ట్ర ప్రయోజనాలు, యువత ఉపాధి, ఆకాంక్షలు ముఖ్యమా? – చంద్రబాబు తేల్చుకోవాలి. ఎన్నికలప్పుడో, మరో రూపంలోనో ప్రజలకూ అవకాశాలు వస్తుంటాయి. గతంలోలా కాకుండా హేతుబద్ధంగా, నిర్మాణాత్మంగా పరిష్కారాల్ని అందించేవారికే ప్రజల మద్దతుంటే.. రాష్ట్రం మొత్తానికీ కాకపోయినా ప్రత్యామ్నాయంగా వెనకబడిన జిల్లాలకు హోదా పారిశ్రామిక రాయితీల్ని కచ్చితంగా సాధించుకోగలం, యువతకు ఉపాధి అవకాశాల్ని పెంచగలం. ఇదే అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకే గత ఏడాది 'హోదా దగా..కింకర్తవ్యం?' పేరుతో లోక్‌సత్తా ఒక బుక్‌లెట్‌ని కూడా విడుదల చేసింది. డీమానిటైజేషన్ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రదర్శించిన ధైర్యాన్ని ఆయన చేసిన తప్పిదాలు చేయకుండా ప్రదర్శించగలిగితే యువత ప్రత్యేక హోదాతో మొదలుపెట్టి అనేక అద్భుతాల్ని సాధించగలుగుతారు. ✦


# హోదా అడిగితే దేశద్రోహమా?

## పారిశ్రామిక రాయితీలు హోదాలో భాగం కాదనడం అవాస్తవం

- మీ స్వార్థం కోసం ప్రత్యేక హోదా నిర్వచనాన్ని మార్చొద్దు
- పారిశ్రామిక రాయితీలు వస్తాయి కాబట్టే వారికి నష్టమని దివంగత జయలలిత కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు
- ప్యాకేజీ ఒక నాన్సెన్స్.. హోదా ఉన్న రాష్ట్రాలకే పారిశ్రామిక రాయితీలు
- విజ్ఞత గల ఏ ప్రభుత్వం కూడా ఈ విధంగా చేయదు
- ప్రత్యేక హోదా.. సీఎం చంద్రబాబు ప్రైవేటు వ్యవహారం కాదు
- విశాఖ ఎయిర్‌పోర్టులో విపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు అప్రజాస్వామికం

**'సాక్షి' ఇంటర్వ్యూలో జయప్రకాష్ నారాయణ్**

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసమే ప్రయత్నిస్తామని ఆరు నెలల క్రితం వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా ఇతర కేంద్ర మంత్రులు చెప్పిన మాటలనే ఇప్పుడు రాష్ట్రంలో యువత, ప్రతిపక్ష పార్టీలు గుర్తు చేయడానికి పూనుకుంటే అది దేశద్రోహ చర్య ఎలా అవుతుందని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రశ్నించారు. నిన్నటిదాకా వారు చేసిన వాదన నేడు వారికే నచ్చకపోతే అన్యాయమైపోతుందా? అక్రమమైపోతుందా? సడెన్‌గా ఆ మాట ఎత్తడమే తప్పు అవుతుందా? పాలకుల్లో ఇలాంటి అసహనం పెరగడం రాష్ట్రానికి ఏమాత్రం మంచిదికాదన్నారు. 'సాక్షి'కి ప్రత్యేకంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో జేపీ మాట్లాడుతూ.. విశాఖపట్నం ఎయిర్ పోర్టులో ఏపీ ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్ పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరు ఏమాత్రం ప్రజాస్వామిక చర్య అనిపించుకోదన్నారు. తిమ్మిని బమ్మి చేసి ప్రజలను భ్రమింప చేసేందుకు తెలుగుదేశం, బీజేపీలు ప్రత్యేకహోదా నిర్వచనాన్ని మార్చి, పారిశ్రామిక రాయితీలు అందులో భాగంకానట్టు ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. కేంద్రం రాష్ట్రానికి చేస్తున్న సహాయానికి ప్యాకేజీ అన్న పేరు పెట్టడాన్ని ఆయన నాన్సెన్స్‌గా పేర్కొన్నారు.




**జయప్రకాష్ నారాయణ్ ఇంటర్వ్యూలో ముఖ్యాంశాలు:**

**సాక్షి: ప్రత్యేక హోదాకు బదులు కేంద్రం ప్యాకేజీ ప్రకటించింది. హోదా కోరే అవసరం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారు. మీరేమంటారు?**

జేపీ: రాష్ట్ర విభజన అనివార్యం అయిన పరిస్థితుల్లో ఆనాడు ప్రత్యేకహోదా ప్రతిపాదన తెచ్చిందే నేను. హోదా వల్ల పన్ను రాయితీలు వస్తాయి. పన్ను రాయితీలు వస్తే ఆంధ్రప్రదేశ్‌కు పరిశ్రమల పెట్టుబడులు గణనీయంగా వచ్చే అవకాశముంది.

హోదా ఉన్న రాష్ట్రాలకే పారిశ్రామిక రాయితీలు దక్కాయి.

**(? హోదా కోసం ఎవరు గొంతు విప్పే ప్రయత్నం చేసినా సీఎం చంద్రబాబు అణచివేయడం సబబేనా**

అధికారంలో ఉన్నవారికి నచ్చినా, నచ్చకపోయినా, ప్రజలు తమ కోరికకు అనుగుణంగా నిరసన తెలిపే హక్కు ఉంటుంది. రాష్ట్రంలో ఫలానాది జరిగితే బాగుండని.. ఎవరూ పట్టించుకోవడంలేదని పది మంది గుమిగూడి నిరసన తెలపచ్చు. ఇది ప్రజాస్వామ్య హక్కు. ప్రజాస్వామ్యానికి, అప్రజాస్వామ్యానికి తేడా ఏంటి? ప్రజాస్వామ్య సమాజంలో ఎవరైనా ఎక్కడికైనా వెళ్లవచ్చు. ఇతరులకు ఇబ్బంది లేకుండా ఎవరైనా, ఎంతమందైనా గుమిగూడొచ్చు. ఇవన్నీ ప్రజాస్వామ్య హక్కులు.

**(?) ఆరు నెలల క్రితం అందరూ ప్రత్యేక హోదా కోసం ప్రయత్నం చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు చెప్పారు. హఠాత్తుగా ఆరు నెలల్లో పరిస్థితులు మారాయి. హోదా గురించి మాట్లాడితే, అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ అంశాన్ని ఎలా చూడాలి**

వాళ్లన్నమాట ఆరు నెలల తర్వాత ఇతరులు అంటే అది దేశద్రోహం ఎలా అవుతుంది? ప్రత్యేక హోదా అవసరం లేదనుకుంటే శ్వేతపత్రం ప్రకటించి, 'పన్ను రాయితీ అవసరం లేదు. ప్యాకేజీ సరిపోతుంది' అని చెప్పమనండి. నిన్నటిదాకా వాళ్లు చేసిన వాదన ఇప్పుడు అన్యాయమైపోయింది, అక్రమమైపోయింది. మాట ఇచ్చారు కాబట్టి అడుగుతున్నారు. ఇది తప్పు ఎలా అవుతుంది. విజ్ఞత ఉంటే రాష్ట్ర ప్రభుత్వమే కేంద్రం వద్దకు వెళ్లి ఆనాడు అలా మాట ఇచ్చాం. ఏదోరకంగా పరిష్కారం చేద్దామంటూ దాని కోసం ప్రయత్నించాలి. ఈ రకంగా అడిగేవారి గొంతు నొక్కడం విజ్ఞత కాదు. బలవంతంగా నోరు మూసే ప్రయత్నం చేస్తే ప్రజల్లో ఆగ్రహం పెరుగుతుందిగానీ తగ్గదు.

**(?) రాష్ట్రంలో ఎక్కువమంది ప్రత్యేక హోదా కావాలంటున్నారు. చంద్రబాబు మాత్రం ప్యాకేజీ సరిపోతుందంటున్నారు. పరిష్కారం ఏమిటి**

రాష్ట్రానికి పారిశ్రామిక రాయితీల కోసం ఇప్పటివరకు ప్రభుత్వపరంగా ప్రయత్నమే జరగలేదు. అది కచ్చితంగా తప్పు. తమిళనాడు సీఎం జయలలిత రాష్ట్రం వచ్చిన కొత్తలోనే 'తెలుగు ప్రజలు మా సోదరులే, వారికి ప్రత్యేక హోదా కల్పించి సహాయం చేసేటప్పుడు మా పెట్టుబడులు తరలిపోకుండా మీరు ఆ రాష్ట్రానికి సాయం చేయండి' అని కేంద్రానికి లేఖ రాశారు. అది సబబైన ఉత్తరం. వాళ్లు అలా కోరుకోవడంలో తప్పు లేదు. మన రాష్ట్ర ప్రభుత్వం ఏనాడైనా 'ఏ రాష్ట్రానికీ ఇబ్బందిలేని రీతిలో మా సమస్య పరిష్కరించడ'ని కేంద్రాన్ని కోరిందా? లేదు. తమిళనాడు సీఎం వాళ్ల రాష్ట్ర ప్రయోజనాల కోసం వెంటనే స్పందించారు. మన రాష్ట్ర ప్రయోజనాల కోసం మన ప్రభుత్వం ఎందుకు ప్రయత్నం చేయలేదు? ఇది రికార్డులో ఉంది. అడుగుతున్నా జవాబుచెప్పమనండి.

**(?) ప్రతిపక్ష నాయకుడైన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజల పక్షాన ప్రశ్నించకూడదా**

ఓట్లు కావాలనుకున్నప్పుడు అధికారంలో ఉంటే మేం ఫలానా పని చేశామని చెప్పుకుంటారు. ప్రతిపక్షం వాళ్లు ఫలానాది చేయడంలేదని ప్రచారం చేస్తారు. దీనిని భయంకరమైన కుట్రగా చిత్రీకరించడం సరైన పద్ధతి కాదు. ప్రజాస్వామ్యబద్ధంగా వారికి ఆ హక్కు ఉందని గుర్తించండి. ఈ హక్కు మీరు ఇవ్వలేదు. ఇది రాచరికం కాదు. ఒక అధికారో, ఒక ప్రభుత్వమో ఈ హక్కులను ఇవ్వలేదు.

**(?) ప్రత్యేక హోదా కంటే ప్యాకేజీ వల్ల ఎంతో చేశామంటున్నారు.. నిజమేనా**

దీనిపై ఒక అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడం ఇప్పటివరకు జరగలేదు. రాష్ట్రానికి ఏయే హామీలు ఇచ్చారు. ఏవి జరిగాయి, ఏవి జరగలేదు. ఏం సాధించుకోవాలి, సాధ్యం కాకపోతే ఎందుకు సాధ్యం కాదో ప్రభుత్వం శ్వేతపత్రం రూపంలో చెప్పాలి. కానీ ఇదంతా జరగలేదు. ఇది ప్రైవేటు వ్యవహారం కాదు. ప్రజల ముందు పెట్టాలి. ప్యాకేజీ అంటున్నారు. ఆ పదమే నాన్సెన్స్. ఉదాహరణకు కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కి రెవెన్యూ లోటు భర్తీ చేస్తోంది. ఇదే సమయంలో దేశంలో ప్యాకేజీలేని ఇతర అన్ని రాష్ట్రాలకూ రెవెన్యూ లోటు భర్తీ జరిగింది. ఏపీకే ప్రత్యేకం కాదు. విభజన చట్టంలో పెట్టారు కాబట్టి కొన్ని విద్యాసంస్థలు, వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు, పోలవరం జాతీయ ప్రాజెక్టుకు ఆర్థిక సాయం చేస్తున్నారు. దీంట్లో ఎవరూ ఎవరికీ మెహర్బానీతో చేసినవి లేవు. ఒక స్లోగన్ పెట్టి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. పన్ను రాయితీలు అన్నవి ప్రజలు కోరుకుంటున్నారు. దానిని సాధించుకోవాలి. రాష్ట్రం మొత్తం సాధ్యం కాకపోతే కొన్ని

ప్రాంతాలకైనా సాధించుకోవాలి. ఇందుకు ఇతర రాష్ట్రాలతో కూర్చుని ప్రయత్నాలు చేయాలి.

**(?) ప్రతిపక్ష నాయకుడిని విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో రన్ వే పై అలా నిర్బంధించవచ్చా**

అది ఏమాత్రం హర్షిందదగ్గ విషయం కాదు. ప్రజాస్వామ్యంలో హింసను ప్రేరేపించకుండా, ఇతరులకు భంగం కలగకుండా ఎవరైనా ఏదైనా చెప్పుకునే హక్కు ఉంది. ఈ ఫండమెంటల్ గుర్తించకపోతే ప్రజాస్వామ్యం నడవదు. అధికారంలో ఉన్నవారు తమకు ఇష్టంలేని ప్రతివారిని దేశద్రోహులుగా చిత్రీకరించడం ప్రజాస్వామ్యం కానే కాదు. ప్రభుత్వానికి ఆ హక్కు లేదు.

(ఇన్‌సెట్ బాక్సు)

**(?) ముఖ్యమంత్రి అనేకమార్లు ప్రధానిని కలిశారు గదా**

ముఖ్యమంత్రి ప్రధానిని కలుస్తారు. ఎంపీలు కూడా కలుస్తారు. మనకు అనవసరం. నిర్దిష్ట ప్రశ్న అడుగుతున్నాను. మన ప్రయోజనాలు కాపాడటం కోసం మీరు ఏయే ప్రయత్నాలు చేశారో చెప్పండి. చేయకపోతే ఎందుకు చేయలేదో చెప్పండి. ప్రత్యేక హోదా సాధ్యం కాకపోతే, ప్రత్యామ్నాయాలపై అధ్యయనం చేశారా? ఆర్థికవేత్తలతో కూర్చుని మాట్లాడారా? ఢిల్లీతో కూర్చున్నారా? చెప్పమనండి. ప్రత్యేక హోదా గురించి పార్లమెంటు సాక్షిగా నాటి పాలకపక్షం, ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ హామీలు ఇచ్చి నేడు వెనక్కితగ్గడం మంచి పద్ధతి కాదు. ఇలా చేయడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లుతుంది. ప్రత్యేక హోదా గురించి చట్టంలో పెట్టినా పెట్టకపోయినా పార్లమెంటు సాక్షిగా హామీ ఇచ్చినందున దాన్ని నెరవేర్చాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రంలో భాగస్వామ్యంగా ఉన్న నేపథ్యంలో ప్రత్యేక హోదాపై కేంద్రం హామీ గురించి అడగాలి. ఇతర రాష్ట్రాలను కలుపుకుని కేంద్రంతో చర్చించి రాష్ట్రానికి మంచి జరిగేలా చూడాలి. ప్రత్యేక హోదాలోనే ప్రత్యేక ప్యాకేజీ ఉందని గుర్తించాలి. ✦

# యువత రుజుమార్గంలో ప్రయాణిస్తేనే వివేకానంద ఆశయాల్ని నెరవేర్చగలరు

స్వేచ్ఛగా, సంతోషంగా జీవించటానికి కావలసిన ధైర్యాన్ని, కులమతాలకతీతమైన సమతాభావాన్ని ఈ దేశానికి అందించిన మహనీయుడు స్వామి వివేకానంద అని లోక్‌సత్తా నేతలు నివాళులర్పించారు.

ఖమ్మంలో లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో వివేకానంద జయంతి, యువజన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

లోక్‌సత్తా సలహాదారు, రిటైర్డ్ సూపరింటెండెట్ ఇంజినీర్ కనకపూడి వెంకటేశ్వర్లు వివేకానంద విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. యువత రుజుమార్గంలో ప్రయాణించినప్పుడే వివేకానంద ఆశయాలు నెరవేరతాయన్నారు.



యువత సేవాభావంతో చుట్టుపక్కల సమస్యలపై హేతుబద్ధంగా, పరిష్కారాలతో స్పందిస్తూ సామాజిక రాజకీయం చేయాలని, ఇదే పెద్ద ప్రజాసేవ అని ఖమ్మం జిల్లా లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు కొర్లకంటి బాలస్వామి అన్నారు.

కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే రహీమ్, యువసత్తా నాయకుడు కొంపాటి శివాజీ, మండల నాయకుడు కంచర్ల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ✦




# చంద్రబాబుకి అంత కంగారెందుకు?!
## హోదాపై ఇప్పటికైనా అఖిలపక్షం ఏర్పాటు చేయాలి: లోక్‌సత్తా

రాష్ట్రానికి ఇచ్చిన ప్రత్యేక తరగతి హోదా హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సోషల్ మీడియా ద్వారా యువత చేస్తున్న ఉద్యమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి అంత ఉలుకెందుకు? అని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అడిగారు. జనవరి 26న విశాఖ బీచ్‌లో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తామన్నా ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణగదొక్కారని, ప్రతిపక్ష నేతని విమానాశ్రయంలోనే అరెస్టు చేశారని, ఇలాంటి ధోరణులు సరికాదని అన్నారు. రిపబ్లిక్ డే రోజున 5కె, 10కె రన్‌లను నిర్వహిస్తున్నారన్నారు. హోదా హామీ నెరవేర్చటం లేదని కేంద్ర ప్రభుత్వానికి నిరసన తెలియచేసే కార్యక్రమానికి ముఖ్యమంత్రినే నాయకత్వం వహించమని కోరిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమం విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సులో పాల్గొనేవారికి రాయితీలిచ్చేందుకే కాబట్టి.. వారి ప్రతిస్పందన గురించి కూడా ప్రభుత్వం భయపడాల్సిన పని ఉండేది కాదన్నారు. ఇంకా సర్కారుకు భయం ఉంటే.. యువతకు నచ్చచెప్పి వేరే వేదిక మీదో, మరో రోజో నిరసన వ్యక్తం చేసుకోమని చెప్పి ఉండాల్సిందన్నారు. చంద్రబాబు అనవసర కంగారులో తప్పు మీద తప్పు చేస్తున్నారన్నారు.

విజయనగరంలో పార్టీ నేతలతో సమావేశం అనంతరం బాబ్జీ మీడియాతో మాట్లాడారు.

పారిశ్రామిక పన్ను రాయితీలతో యువతకు ఉద్యోగాలను తేవటంలో కీలకమైన ప్రత్యేక హోదాపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం ఏరు దాటాక తెప్పతగలేసినట్టు వ్యవహరిస్తున్నాయని బాబ్జీ అన్నారు. హోదా కన్నా రాష్ట్రానికి ఎక్కువ కేంద్ర సాయం తెస్తున్నానంటున్న చంద్రబాబు.. ఆ విషయంపై అఖిలపక్షం ఎందుకు ఏర్పాటు చేయలేకపోతున్నారని ప్రశ్నించారు.

ముఖ్యమంత్రికి ఏమాత్రం చిత్తశుద్ధి, విజ్ఞత ఉన్నా ఇప్పటికైనా అఖిలపక్షం ఏర్పాటు చేయాలని, అన్ని పార్టీలనూ కలుపుకుని కేంద్రంతో పోరాడి ప్రత్యేక హోదాను సాధించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదాకు ఇతర రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు వస్తాయనుకుంటే.. ఇప్పటికే లోక్‌సత్తా సూచించినట్టు రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ సహా అన్ని రాష్ట్రాల్లోని 80-100 వెనకబడిన జిల్లాలకు హోదా రాయితీలు ఇప్పించే ప్రతిపాదనకు ఒప్పించాలన్నారు.

సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు పతివాడ చంద్రరావు, బి. సన్యాశినాయుడు, తాత్రాజు రాజారావు, అల్లంశెట్టి నాగభూషణం, మొల్లేటి నాయుడు, కాశీపతి, మహిళాసత్తా అనంతలక్ష్మి, పొలిపర్తి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ✦




# హోదా కోసం కలసి ఉద్యమించాల్సిన సమయం

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై రాష్ట్రంలోని, కేంద్రంలోని తెలుగుదేశం, బీజేపీ ఆధ్వర్యంలోని ప్రభుత్వాలు ప్రజలను దగా చేశాయని, హోదా సాధనకు అన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు కలసిపోరాడాల్సిన సమయం ఆసన్నమైందని హైదరాబాద్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం ప్రకటించింది. ఆంధ్రులకు ఆత్మగౌరవం కావాలో, అబద్ధాలు కావాలో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టంచేసింది. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రుల స్థాయి వ్యక్తులు చెబుతున్న అబద్ధాలు క్షమార్హం కావని పేర్కొంది. ఉద్యమాలపై ఉక్కుపాదం మోపే ప్రభుత్వ తీరుని గర్హించింది. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో లక్ష్మణ్‌రెడ్డి అధ్యక్షతన 'విభజన చట్టం, ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ' అంశాలపై జరిగిన రౌండ్‌టేబుల్‌లో వివిధ పార్టీల, సంస్థల ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

లక్ష్మణ్‌రెడ్డి ప్రారంభోపన్యాసం చేస్తూ, హోదాతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. ప్రత్యేక ప్యాకేజీకి చట్టబద్ధత అంటూ మోసం చేస్తున్నారని కాంగ్రెస్ నేత తులసిరెడ్డి విమర్శించారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్, వైసీపీ కలసి మోదీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టాలన్నారు. హోదా కోసం తమ పార్టీ పోరాడుతూనే ఉందని, ఎంపీల రాజీనామాను ప్రయోగించేందుకు సిద్ధమైందని వైసీపీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ అన్నారు. హోదాలో పారిశ్రామిక రాయితీలు భాగం కాదనే తప్పుడు వాదనను గోబెల్ ప్రచారం చేసి ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధికార ప్రతినిధి కూనంపూడి శ్రీనివాస్ అన్నారు. పారిశ్రామిక రాయితీలు హోదాలో భాగం కాబట్టే.. తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత ఆందోళన వ్యక్తం చేస్తూ కేంద్రానికి లేఖ రాశారని, తమ రాష్ట్రంలోని పరిశ్రమలు తరలిపోకుండా ఏపీకి సాయం చేయమని కోరారని గుర్తుచేశారు. ఏపీకి ప్రత్యేక హోదా కోసం ఇతర రాష్ట్రాలను ఒప్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంతవరకూ ప్రయత్నమే చేయలేదన్నారు. హోదాతో సంబంధం లేకుండా కూడా పారిశ్రామిక రాయితీల్ని కేంద్ర కేబినెట్ ఉత్తర్వుతో తెచ్చుకోవచ్చని కొంతకాలం క్రితం లోక్‌సత్తా సూచించిందని, దానిపై ఆలస్యంగా స్పందించిన సీఎం కేవలం అమరావతికి రాయితీలు అడిగారని అన్నారు. ప్రధానమంత్రి పార్లమెంటులో ఇచ్చిన హామీ చట్టంతో సమానమేనన్నారు. ఒకవేళ కేంద్రానికి ఇబ్బంది ఉంటే.. రాష్ట్రం మొత్తానికీ కాకపోయినా రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ సహా దేశవ్యాప్తంగా వెనకబడిన 80–100 జిల్లాలకు హోదా పారిశ్రామిక రాయితీలు అడగాలని లోక్‌సత్తా ఇప్పటికే ప్రతిపాదించిందన్నారు. ఏపీ మొత్తానికీ హోదా లేదా వెనకబడిన జిల్లాలకు హోదా.. ఏదోకటి సాధించేలా కలసికట్టుగా పోరాటం చేయాలన్నారు. రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి మాట్లాడుతూ, వైసీపీ ఎంపీలు రాజీనామా చేస్తే అది పెద్ద చర్యే అవుతుందన్నారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ, విశాఖ విమానాశ్రయంలో ఏపీ విపక్ష నేత వైఎస్ జగన్‌ను అడ్డుకోవడమంటే ఉద్యమాన్ని చూసి బాబు భయపడటమేనన్నారు. రాయలసీమ అభివృద్ధి మండలి నేత ఇస్మాయిల్, చార్టెడ్ అకౌంటెంట్ వెంకట్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు చెన్ను శివప్రసాద్, టీవీరావు, పోతురాజు శివ తదితరులు ప్రసంగించారు. ✦

# సిక్కోలు నుంచే
# లోక్‌సత్తా 'ఉత్తరాంధ్ర అభివృద్ధి' శంఖారావం



**కేం**ద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మోస పూరిత రాజకీయాలతో ఉత్తరాంధ్ర ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని లోక్‌సత్తా పార్టీ పేర్కొంది. పాలకులు మారుతున్నారు తప్ప ఉత్తరాంధ్ర అభివృద్ధి మాత్రం జరగటం లేదని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. నిధులు, ప్రాజెక్టుల విషయంలో అన్యాయం జరుగుతోందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలలాగే రాయలసీమ ప్రాంతం కూడా వెనకబడి ఉందని, ఈ ఏడు జిల్లాల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని అన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల బాధల్ని పట్టించుకునేవారు కరవయ్యారన్నారు. మానవాభివృద్ధి సూచిలో ఏపీలోని 13 జిల్లాల్లో.. శ్రీకాకుళం 12వ స్థానంలో, అనంతపురం 13, విజయనగరం 10, కర్నూలు 11, విశాఖపట్నం 9వ స్థానంలో ఉన్నాయన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి లోక్‌సత్తా పార్టీ శ్రీకాకుళం నుంచే ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడుతుందన్నారు. లోక్‌సత్తా బహుజన వేదిక, యువజన మహిళా వేదికల్ని ఏర్పాటు చేస్తున్నామని, యువత, అన్ని వర్గాల ప్రజానీకం ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై పార్టీ సీనియర్ నాయకులు శ్రీకాకుళంలో నిర్వహించిన సమావేశానికి బాబ్జీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక ఎన్జీవో హోంలో కొత్తకోట పోలినాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి కల్లూరి బాలసుబ్రమణ్యం కూడా పాల్గొన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలతో పాటు తూర్పుగోదావరి నుంచి నేతలు వచ్చారు. స్టీరింగ్ కమిటీ సభ్యులు ఆకుల దామోదర్, ఎంఎస్ఎన్ మూర్తి, ముదునూరి రాజ్ వర్మ, ఆర్.పద్మావతి తదితర నేతలు సమావేశంలో తమ సూచనలనిచ్చారు.


రాష్ట్రం కలిసున్నా, విడిపోయినా, ఏ పార్టీకి, ఏ నాయకుడికి అధికారం ఇచ్చినా.. ఉత్తరాంధ్రలో అత్యధిక ప్రజల బతుకులు మారటం లేదని బాబ్జీ అన్నారు. విభజన అనంతరం ఈ ప్రాంతం ఆర్థికంగా మరీ నష్టాన్ని ఎదుర్కొంటోందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో యువత పరిస్థితి ఇంకా ఘోరంగా ఉందని.. వ్యవసాయం, ఉద్యోగం లేని పరిస్థితి నెలకొందన్నారు. ఇక్కడ పెద్దసంఖ్యలో జూట్, ఐరన్, అల్యూమినియం ఫెర్రో అల్లాయిస్, చక్కెర పరిశ్రమలు మూతపడినా పట్టించుకోవటం లేదన్నారు. ఉన్న పరిశ్రమలు విశాఖ నగరానికే పరిమితమయ్యాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి అమరావతి తప్ప రాష్ట్రంలోని మరే ప్రాంతమూ కనిపించటం లేదని, యువతను నిర్వీర్యం చేసే విధానాలను ఆయన అనుసరిస్తున్నారని ధ్వజమెత్తారు.

వ్యవసాయాధారిత పరిశ్రమలు, సహజ వనరులు వెలికితీసే పరిశ్రమలు, ప్రాసెసింగ్ యూనిట్లు పెడుతూనే చిన్న పరిశ్రమలకు ప్రభుత్వం చేయూత నివ్వాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రికి చేతనైతే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తేవాలని, లేదంటే కనీసం ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకైనా హోదా రాయితీలు సాధించాలని బాబ్జీ అన్నారు. వీటికోసం చంద్రబాబు అఖిలపక్షం ఎందుకు వేయటం లేదని ప్రశ్నించారు. ఉత్తరాంధ్రకు కంటి తుడుపుగా వచ్చిన రెండు మూడొందల కోట్ల రూపాయలను కూడా ఖర్చు చేయకుండా ప్రభుత్వం దారి మళ్లిస్తోందన్నారు. మేధావులు మౌనంగా ఉంటే మరింత నష్టం జరుగుతుందని, ఆలోచనాపరులు గళం విప్పాలని, ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని అన్నారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాది రాంబాబు ఆధ్వర్యంలో శ్రీకాకుళం, ఎచ్చెర్ల, ఆమదాలవలస నియోజకవర్గాలకు చెందిన 20 మంది యువత లోక్‌సత్తా పార్టీలో చేరారు. ✦

# ఆనాడు ఈ ఒక్కడి మాట విని ఉంటే ఏపీకి ఈ గతి పట్టేది కాదు

- భీశెట్టి బాబ్జీ,
లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షులు




ఒకే ఒక్కడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి శాసనసభలో, తెలుగు జాతి ఉమ్మడి ప్రయోజనాల కోసం పోరాడిన ఒకే ఒక్కడు - ఎమోషన్స్ రెచ్చగొట్టి ఎన్నికల్లో గెలవడమే రాజకీయంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో, నిజాయతీ, హేతుబద్ధత, అందరి ప్రయోజనాల సమన్వయం అనే విలువల కోసం పోరాడుతున్న ఒకే ఒక్కడు. ఆ ఒక్కడు చెప్పిన మాటల్ని విని ఉంటే నవ్యాంధ్రకు ఈ దుస్థితి వచ్చేది కాదు. పోలవరం కోసం అరుణ్ జైట్లీ కాళ్లు పట్టుకోవాల్సిన ఖర్మ, రాజధాని కోసం నరేంద్ర మోదీ దయ కోసం ఎదురుచూసే పరిస్థితి, ప్రత్యేక హోదా కోసం యువత రోడ్డెక్కాల్సిన స్థితి రావడానికి ఆ ఒక్కడి మాటను ఏ ఒక్క నాయకుడు వినకపోవడమే కారణం. ఆ ఒక్కడ ఎవరో మీకు ఇప్పటికే అర్థం అయివుంటుంది. ఆ ఒక్కడే లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్.

ప్రత్యేక హోదా సాధన కోసం యువత ఉద్యమిస్తున్న ఈ సమయంలో, ప్రత్యేక హోదా అనే డిమాండ్‌ని మొట్టమొదట అసెంబ్లీలో వినిపించిన జేపీ, 2009 నుంచి ఇప్పటిదాకా తెలుగు ప్రజల మేలు కోసం ఏం చేశారో ఒకసారి చూద్దాం.

డిసెంబర్ 9న కేంద్ర హోం మంత్రి చిదంబరం ప్రకటన వచ్చింది. తెలంగాణలో సంబరాలు, సీమాంధ్రలో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. ఈ సందర్భంలో జేపీ, కేంద్ర ప్రభుత్వ పెద్దలని కలిశారు. అధికారం, అభివృద్ధి అంతా ఒకే చోట కేంద్రీకరించడం వల్లే రాష్ట్ర విభజన డిమాండ్ వచ్చిందని, దీన్ని అవకాశంగా తీసుకుని జిల్లా ప్రభుత్వాల ఏర్పాటుకి చొరవ తీసుకోవాలని నాటి ప్రధానమంత్రి డా॥ మన్మోహన్‌ను జేపీ కోరారు. మన్మోహన్ మౌనంగా ఉండిపోయారు. తెలంగాణ ఉద్యమంలో తీవ్ర భావజాలం ఉన్నవారు ముఖ్యపాత్ర పోషిస్తుండటం జేపీని కలవరపెట్టింది. వీరి నాయకత్వంలో తెలంగాణ వస్తే హైదరాబాద్ అభివృద్ధి ఆగిపోతుందని జేపీ భావించారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలని సీమాంధ్ర ఉద్యమ నాయకత్వం సరిగా అర్థం చేసుకోకపోవడం, డిసెంబర్ 9 ప్రకటనని రద్దు చేయించి డిసెంబర్ 23న మరో ప్రకటన చేయించడంతో తెలంగాణ ప్రజల్లో నోటి దాకా వచ్చిన ముద్దని సీమాంధ్ర నాయకులు లాగేసుకున్నారు అనే భావన పెరిగింది. రెండు ప్రాంతాల ప్రజల మధ్య దూరం పెరిగింది. రెండు

ముక్కలు కలిసివుండటం అసాధ్యం అని అర్థమయ్యాక జేపీ, సామరస్య పరిష్కారం కోసం ప్రయత్నం చేశారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభజనకు నిర్ణయం తీసుకున్నాక, ఇరు ప్రాంతాలకి న్యాయం చేయడం కోసం జేపీ ప్రయత్నం చేశారు. రాష్ట్రం విడిపోతే కోస్తాంధ్ర ప్రాంతానికి మిగులు బడ్జెట్ ఉంటుందని, రాయలసీమ కోస్తాంధ్రని కలిపి ఉంచితే మాత్రం, ఏపీ లోటు బడ్జెట్‌లోకి వెళ్తుందని జేపీ లెక్కలు వేశారు. అందుకే.. అయితే రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేయండి లేదా రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేక తరగతి హోదా ఇచ్చి న్యాయం చేయండి అని కేంద్ర పెద్దలకి జేపీ చెప్పారు. కేంద్రం పట్టించుకోలేదు. రెవెన్యూ లోటుతో ఏర్పడుతున్న కొత్త ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా నిలబడాలి అన్నా, పారిశ్రామికాభివృద్ధి జరగాలన్నా రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని జేపీ డిమాండ్ చేశారు (ఇది అసెంబ్లీలో రికార్డ్ అయి ఉంది). ఉత్తరాంధ్ర వెనకబాటుని అధ్యయనం చేసిన జేపీ, ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమైక్య ఉద్యమం వల్ల ఉపయోగం లేదని, సీమాంధ్రకి ఏం కావాలో అడుగుదామని జేపీ చేసిన వాదన అరణ్య రోదన అయింది. జేపీ సీమాంధ్ర పర్యటనని కొందరు అడ్డుకున్నారు. అప్పుడే కనక సీమాంధ్ర ప్రజలు జేపీ మాట విని ఉంటే, ఆవేశాన్ని పక్కనపెట్టి ఆలోచనతో ముందుకు వెళ్లి ఉంటే, ఈ దుస్థితి వచ్చేది కాదు. అప్పుడు ఆంధ్ర, రాయలసీమ ప్రజలు ఏం కోరితే అది ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉన్నాయి. కానీ ఆవేశంలో ఉన్న యువత, అవకాశవాద రాజకీయ నాయకులు, డ్రామాలు తప్ప నిజాలు పట్టని మీడియా ఎవరూ జేపీ మాటని పట్టించుకోలేదు. జనవరిలో జేపీ ప్రత్యేక హోదాకు డిమాండ్ చేస్తే, ఫిబ్రవరిలో లోక్‌సభలో బిల్ పాస్ అయ్యేదాకా ఏ పార్టీ కూడా ప్రత్యేక హోదా డిమాండ్‌ని పట్టించుకోలేదు. జేపీ వెంకయ్యానాయుడితో మాట్లాడాక, ఆయన ఒక్కడే రాజ్యసభలో ప్రత్యేక హోదాకు పట్టుబట్టి మన్మోహన్‌సింగ్‌తో ప్రకటన చేయించారు.

రెండు రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడేందుకు ఢిల్లీ స్థాయిలో సమన్వయం చేసేందుకు వీలుంటుందని జేపీ మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం నుంచి పోటీచేశారు. అక్కడి ఓటర్లు జేపీని కాదని వ్యాపారవేత్త అయిన మల్లారెడ్డిని ఎంపీగా ఎన్నుకున్నారు. మల్లారెడ్డి ఇప్పటిదాకా లోక్‌సభలో ఏం చేశారో ఎవరికీ తెలియదు. ప్రజలు తనకి ఓట్లు వేయకపోయినా, ప్రజల కోసమే ఆలోచించే జేపీ, ప్రత్యేక హోదా సాధన కోసం ఒక ప్రాక్టికల్ పరిష్కారం సూచించారు. మొత్తం రాష్ట్రానికీ ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాకపోతే, దేశంలో అత్యంత వెనకబడిన 100 జిల్లాలకు పారిశ్రామిక రాయితీలు ప్రకటించమని, దానిలో ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లా, ఉత్తర తెలంగాణను చేర్చమని జేపీ సూచించారు. జేపీ చెప్పినట్టు చేస్తే, తెలంగాణలో మూడు జిల్లాలు, తమిళనాడులోని మూడు నాలుగు జిల్లాలు, ఒడిషాలోని కొన్ని జిల్లాలకు కూడా ప్రయోజనం కలుగుతుంది కాబట్టి, ఇతర రాష్ట్రాలు కూడా అభ్యంతర పెట్టవు. జేపీ చేసిన ఈ సూచనను కూడా తెలుగుదేశం ప్రభుత్వం పట్టించుకోలేదు. అభివృద్ధి మొత్తాన్ని ఒకే చోట కేంద్రీకరించే ఆలోచనలో ఉన్న చంద్రబాబు అమరావతికి ప్రత్యేక హోదా ఇవ్వమని కేంద్రాన్ని అడిగారు. కేంద్రం దాన్ని పట్టించుకోలేదు. సొంత వ్యాపారాలు తప్ప, రాష్ట్రం అభివృద్ధి పట్టని మన ఎంపీలు కేంద్రాన్ని నిలదీయలేదు.

'రాష్ట్రం విడిపోతే తెలంగాణ స్వర్గమూ కాదు, సీమాంధ్ర నరకమూ కాదు. రాజకీయం మారకుండా రాజధాని మారినంత మాత్రాన ప్రజలకు ఒరిగేది ఏమీ ఉండదు' అని జేపీ మొదటి నుంచి చెబుతున్నారు. రాష్ట్రం విడిపోయాక, తెలంగాణ స్వర్గం అయిందో లేదో అక్కడి ప్రజలు చెబుతారు. కానీ నవ్యాంధ్ర మాత్రం నరకంగా మారలేదు. రెవెన్యూ లోటు, పరిశ్రమలు లేకపోవడం అనే సమస్యలు తప్ప రాష్ట్ర విభజన వల్ల ప్రజల జీవితాల్లో పెద్ద మార్పులు ఏమీ రాలేదు. ఇప్పుడు ఏపీ ఎదగాలి అంటే, భారీగా పరిశ్రమలు రావాలి. పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు ఉంటే తప్ప పరిశ్రమలు ఎక్కువగా రావు. చంద్రబాబు ఎన్ని విదేశీ పర్యటనలు చేసినా, ఎన్ని రివ్యూలు చేసినా, కోట్లు ఖర్చు పెట్టి ఇన్వెస్టర్ సమిట్స్ పెట్టినా.. పన్నులు తగ్గించకుండా, ప్రోత్సాహకాలు ఇవ్వకుండా పరిశ్రమలు పెద్దగా రావు. అందుకే ఏపీ ఎదగాలి అంటే పన్ను రాయితీలతో కూడిన ప్రత్యేక తరగతి హోదా సాధించుకు తీరాలి.

ఇప్పుడు ప్రత్యేక హోదా కోసం ఉద్యమిస్తున్న యువత జరిగింది తెలుసుకోవాలి. బడా వ్యాపారులని, కాంట్రాక్టర్లని, అవినీతిపరులని ఎంపీలు ఎమ్మెల్యేలుగా ఎన్నుకోవడం, డ్రామారాయుళ్లకి, ఎమోషన్స్ రెచ్చగొట్టేవారికి మాత్రమే జై కొట్టడం వల్ల ఏపీకి ఈ పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా విద్యావంతులు అయిన యువత నిజం తెలుసుకోవాలి. భుజం కలపాలి. పాత రాజకీయాన్ని పాతరేసి కొత్త రాజకీయానికి పట్టం కట్టాలి. కొత్త రాజకీయంతోనే కొత్త రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని గ్రహించాలి.

(కర్టెసీ: కొరడా డాట్‌కామ్) ✦

# పార్టీ నేతల స్పందనని అభినందించిన జేపీ







విజయనగరం జిల్లా కొమరాడ మండలం కూనేరు రైల్వేస్టేషన్ సమీపంలో హిరాఖంఢ్ ఎక్స్‌ప్రెస్‌కు జరిగిన ఘోరప్రమాద బాధితులను ఆదుకునేందుకు తమ వంతు ప్రయత్నం చేసిన లోక్‌సత్తా పార్టీ నేతలను వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అభినందించారు.

రైలు ప్రమాదం గురించి తెలిసిన వెంటనే లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, ఇతర నేతలు ఘటనా స్థలానికి వెళ్లి సహాయసహకారాలను అందించేందుకు ప్రయత్నించారు. పార్వతీపురం పట్టణ పార్టీ కన్వీనర్ కొత్తకోట పాపారావు బృందం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ప్రయాణీకులను సందర్శించి వైద్యసేవల వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు ప్రభుత్వ సాయం పూర్తిస్థాయిలో అందే వరకూ ఆ సమస్యపై దృష్టి ఉంచాలని జేపీ పార్టీ నేతలకు సూచించారు. కేవలం ఎన్నికలు, పార్టీ సమావేశాలకే పరిమితం కాకుండా యువతను భాగస్వాముల్ని చేస్తూ స్థానిక సమస్యలపై పనిచేస్తుండాలన్నారు. నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగత జీవితాన్ని, ప్రజాజీవితాన్ని సమన్వయం చేసుకుంటూ ప్రతిరోజునీ సద్వినియోగం చేసుకుంటే.. లోక్‌సత్తాను బలోపేతం చేసుకుంటూ ప్రజలకు ఇంకా ఎక్కువ మేలు చేయగలుగుతారన్నారు. ✦

# 10లో చేసింది ఒక్కటే!



చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక సెప్టెంబర్ 4, 2014న అసెంబ్లీలో విజయనగరం జిల్లాకు 10 అంశాల్ని హామీ ఇచ్చారని, వాటిలో ఒక్క విమానాశ్రయం తప్ప జిల్లాకు వచ్చింది ఏమీ లేదని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ స్టీరింగ్ కమిటీ సభ్యులు అల్లంశెట్టి నాగభూషణం, తాత్రాజు రాజారావు అన్నారు. లోక్‌సత్తా పట్టణ అధ్యక్షుడు మొల్లేటి చిన్నారావు అధ్యక్షతన ప్రజాసంఘాలతో పార్టీ కార్యాలయంలో "జిల్లా వెనకబాటుతనం – చంద్రబాబు హామీలు" అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. పారిశ్రామిక నగరం, ఏడాదికాలంలో తోటపల్లి రిజర్వాయర్, ఫుడ్‌పార్క్, గిరిజన యూనివర్సిటీ, స్మార్ట్ సిటీ, ఎలక్ట్రానిక్ మరియు హార్డ్‌వేర్ పార్క్, పోర్టు, సంగీత, లలిత కళల అకాడమీ, మెడికల్ కాలేజీ ఏర్పాటు వంటి వన్నీ ఇంకా నీటి మీద రాతల్లాగానే ఉన్నాయని లోక్‌సత్తా నేతలు అన్నారు. జిల్లా వెనకబాటుతనం రోజురోజుకీ పెరిగిపోతున్నా నాయకులు కనీసం పట్టించుకోవటం లేదని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు మండల సత్యనారాయణ, బీసీ సంఘాల అధ్యక్షుడు రామేశ్వరపు రామారావు అన్నారు. జరుగుతున్న పరిణామాలు ప్రజలకు తెలియాలని, వారిలో అవగాహన, చైతన్యం పెరగాలని రిపబ్లికన్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దుర్గారావు అన్నారు. రౌండ్‌టేబుల్‌లో ఆర్టీసీ ఎంప్లాయిస్ రీజినల్ సెక్రటరీ భానుమూర్తి, డి. అప్పారావు, చోడి ఆదినారాయణ, జిల్లా అభివృద్ధి వేదిక ప్రతినిధి షణ్ముఖరావు, హృషీకేశం, బి. సన్యాశినాయుడు, రంధి రవికుమార్, పతివాడ చంద్రారావు, పోలిపర్తి అప్పారావు, శిమ్మ శీను, భాస్కర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ✦

# దేశమాతను పూజించటమే దేశభక్తి కాదు: జేపీ



దేశభక్తి అంటే దేశమాతను పూజించటం, గౌరవించడం మాత్రమే కాదని, దేశంలో ప్రతి బిడ్డకూ విద్య, ప్రతి కుటుంబానికీ ఆరోగ్యం అందేలా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

భిన్నమతాలు, సంస్కృతులకు నిలయం భారతదేశమని, దేశ నిర్మాణానికి ముందుచూపున్న విధానాలు అవసరమని అన్నారు.

గణతంత్ర దినోత్సవం రోజున హైదరాబాద్ డోయిన్స్ కాలనీలోని విద్యాంజలి హైస్కూల్ వార్షికోత్సవానికి జేపీ హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని ఎగరవేసిన అనంతరం విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు.

విద్యార్థులకు నిజమైన దేశభక్తి, నైతిక విలువలు, ఆత్మస్థైర్యం అందిస్తే వారు మంచి పౌరులుగా ఎదుగుతారని జేపీ అన్నారు. ప్రపంచం గర్వపడేలా మన విద్యార్థులు ఎదగడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి ఎంతో అవసరమన్నారు.

కార్యక్రమంలో హైదరాబాద్ వర్సిటీ ప్రొఫెసర్ మీనా హరిహరన్, పాఠశాల వ్యవస్థాపకుడు వెంకటరెడ్డి, సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపల్ బాలాత్రిపురసుందరి, సలహాదారులు మమతారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, కరస్పాండెంట్ నర్సింహారెడ్డి, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ✦


# లోక్‌సత్తా పార్టీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కార్యాలయాల్లోనూ..







తెలుగు రాష్ట్రాల్లోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయాల్లోనూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగరవేసి రాజ్యాంగ నిర్మాతలకు ఘననివాళులర్పించారు. ఉదాత్త విలువలతో బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగానికి పాలకులు తరచూ తూట్లుపొడుస్తున్నారని, వలసపాలననాటి పాలననే ఇంకా కొనసాగిస్తున్నారని లోక్‌సత్తా పార్టీ ఏపీ, తెలంగాణ అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ, డా॥ పాండురంగారావు అన్నారు. దేశ రాజకీయాలలో మౌలిక మార్పులు రావాల్సి ఉందని, యువత ప్రశ్నించటం, పరిష్కారాల్లో భాగమవటం పెద్దఎత్తున జరగాలని అన్నారు. రాజకీయ, ఎన్నికల, పాలనా సంస్కరణలకు, యువత భాగస్వామ్యాన్ని పెంచేందుకు లోక్‌సత్తా తన శక్తికి మించి కృషి చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదాపై ప్రశ్నించేందుకు సోషల్ మీడియా ద్వారా విశాఖలో సమావేశానికి సిద్ధమైన యువతను ప్రభుత్వం అడ్డుకోవటాన్ని వారు ఖండించారు. ✦



# పుర పాలనలో పౌరులెక్కడ?

- మహేష్ విజాపుకర్

**పోలింగ్ బూత్ నుంచి బయటకు రావటంతోనే ఓటరు బాధ్యత ముగిసిపోతోంది. ఇకపై వారు మాట్లాడటానికి లేదు. పౌర పాలనా వ్యవహారాల్లో తాము భాగస్వాములం కామన్న నిర్ధారణకు పౌరులు దాదాపుగా వచ్చేశారు.**

ముంబయి సహా మహారాష్ట్రలోని పది ప్రధాన నగరాలకు ఈ నెలలోనే ఎన్నికలు జరగనున్నాయి. ఈ సందర్భంగా నాకు సికింద్రాబాద్ మేయర్‌గా పనిచేసిన డాక్టర్ యశ్వంత్‌రావు తిమ్మరాజు గుర్తు కొస్తున్నారు. అర్ధ శతాబ్దికి ముందు ఆయన రోజుకు రెండుసార్లు ఆసుపత్రిని నడిపేవారు. ఆ మధ్యలో వీలు చేసుకుని మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి వస్తుండేవారు. అందుకు ఆయన సొంత కారునే వాడేవారు. అప్పట్లో పురపాలక సంస్థ అధికారులకు కార్లను ఇచ్చేవారు కాదు. అప్పట్లో సుందర నగరమైన హైదరాబాద్‌కు ప్రత్యేకంగా ఒక మునిసిపాలిటీ ఉండేది. అది సాదా సీదా కాలం కాబట్టో ఏమో.. మునిసిపల్ వ్యవహారాల కోసం తిమ్మరాజు పూర్తికాలం వెచ్చించాల్సి వచ్చేది కాదు. అది రాజకీయాలకు అతీతమైన బాధ్యతగా ఉండేది. ఆశ్రితులు, రాజకీయ ప్రాపకం ఉండేవి కావు. నగరాలనుకాక, వాటి చుట్టూ తిరిగే రాజకీయాలను మాత్రమే పట్టించుకునే నేటి రోజుల్లో అది మహా విచిత్రమే.

మహారాష్ట్రలో ఎన్నికలు జరగనున్న పది నగరాలలో ఏదీ బాగా పనిచేస్తున్నది కాదు. సేవల విస్తృతి నుంచి నాణ్యత వరకు ప్రతి విషయంలో పౌరులు సమస్యలను ఎదుర్కొంటున్నారని ఏ సామాజిక ఆడిట్ జరిపినా తెలుతుంది. నగర పాలక సంస్థలు డబ్బు చేసుకునే రాజకీయాలను నడిపే వేదికలుగా మారడమే అందుకు కారణం. ఇదంతా ఆయా పార్టీల భావజాలాన్ని విస్తరింపచేయుటం అనే సాకుతోనే జరుగుతుంటుంది. ఒక మామూలు మనిషి కార్పొరేటర్‌గా మొదటి రెండేళ్ల పనిచేసేసరికే సంపన్నుడైపోతాడు. తమ నగరాలు అస్తవ్యస్తంగా ఉన్నాయని పౌరులకు తెలియక కాదు. ఒక పార్టీకి ఓటు చేస్తేనో లేదా ఒక పార్టీని గద్దె దించితేనో తేడా ఉంటుందని భావిస్తున్న ట్టయినా వారు నటించరు. ఏదైనా మార్పు వచ్చినా అది సాధారణంగా యధాతథ స్థితిని తెచ్చేదే. ఒకటో రెండో అరుదైన పట్టణాలు ఇందుకు మినహాయింపు కావచ్చు. మన నగరాలు ఇక మారవని పౌరులు రాజీపడిపోవడం వల్లనే అవి మరింత అధ్వాన్నంగా మారుతున్నాయి.

రాజకీయాల వంతుకు వస్తే..

ప్రత్యేకించి ఈ పది నగరాల ఎన్నికల బరిలో ఉన్న పార్టీలన్నీ నగరాన్ని అధ్వాన్నంగా నడుపుతూ బడ్జెట్‌ని పూర్తిగా ఖర్చు చేయని బాపతే. ప్రత్యేకించి ఇది, దేశంలోనే అత్యంత సంపన్నవంతమైన ముంబయి పురపాలక సంస్థకు మరింతగా వర్తిస్తుంది. దాదాపు ఎవరూ నగరాన్ని బాగుచేయటం గురించి ఆలోచించరు. అంతా మెరుగుపరుస్తామనే వారే.. అది చేయరేమని ఎవరూ అడగకపోవడమే విచిత్రం! పౌరులు దీన్ని రాజకీయ మల్లయోధుల క్రీడగా చూస్తుంటారని పిస్తుంది. విజేతే మొత్తం కొల్ల సొత్తునంతా ఎగరేసుకుపోతాడు. వీక్షకులకు.. పారిశుద్ధ్యం లోపించిన వీధులు, క్రమం లేకుండా సాగే నీటి సరఫరా, అరకొర సిబ్బందితో సదుపాయాలులేని ఆసుపత్రులతో చిల్లర కాసులను దులపరిస్తారు. మార్క్సిజం లేదా హిందూత్వ లేదా ప్రాంతీయ అస్తిత్వాలు వగైరా ఏ ఇజమూ నగర పరిపాలన విషయంలో మినహాయింపు కాదు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రాతినిధ్య ప్రాతిపదికపైన పనిచేసేవి, పురపాలక సంస్థలు "స్వయంపాలక" సంస్థలు అనే విషయాన్నే మరచిపోయాం.

పోలింగ్ బూత్ నుంచి కాలు బయటకు పెట్టడంతోనే ఓటరు బాధ్యత ముగిసిపోతుంది. ఇకపై వారు మాట్లాడటానికి లేదు. వారు ఎన్నుకున్న వారు గొప్పవారు, శక్తిమంతులు అయిపోతారు. ఇక వారు అనుగ్రహించినది పుచ్చుకోవడమే. ఎవరైనా ఏదైనా పౌర సదుపాయాన్ని కల్పించినా.. అది వారు దయతలచి చేసేదే తప్ప, వారి విధి కాదు. పౌర పాలనా వ్యవహారాల్లో తాము భాగస్వాములం కామన్న నిర్ధారణకు పౌరులు దాదాపుగా వచ్చేశారు.

ప్రజాప్రయోజనాల పట్ల పట్టింపు ఉన్న పౌరులు కొందరు పురపాలక ఎన్నికల్లో "పౌర అభ్యర్థులు"గా బరిలోకి దిగినా.. అది ముఖ్య వార్తాంశమే అవుతుంది తప్ప, తోటి పౌరులు వారిని ప్రోత్సహించరు. వారికి ఓటు వేయడం అంటే దాన్ని వృథా చేయడమేనని భావిస్తారు. అలాంటి స్వతంత్రులు గెలిచినా, రాజకీయ కార్పొరేటర్లు వారిని పనిచేయనిస్తారా? అని విస్తుపోతుంటారు. గత దశాబ్ద కాలంలో ముంబయి అలాంటి ఒకే ఒక్క స్వతంత్రుడు, ఒక రాజకీయ పార్టీ మద్దతున్న మరో స్వతంత్రుడు కార్పొరేటర్లు కావడాన్ని చూసింది. అలాంటి పౌర సమష్టి కూటములు స్వభావరీత్యానే నిర్దిష్ట రూపం లేనివి. అవి ఆర్థిక సమస్యలతో సతమతమవుతాయి. అవి రాజకీయాలకు దూరంగా ఉండేవి. కాబట్టి వాటికి రాజకీయ పార్టీల ప్రాపకం లభించకపోవడం అనే అననుకూలత కూడా ఉంటుంది. ఓటర్లకు కావాల్సింది కూడా ప్రాపకమే అనిపిస్తుంది. అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరించడం లేదా కొత్త ఆక్రమణలను అనుమతించడం వంటి తమ వ్యక్తిగత కోరికల కోసం నియమ నిబంధనలను వంచడం గురించి మాట్లాడతారు. అంతేగానీ నగరం బాగుపడటం గురించి మాత్రం కాదు.

(సాక్షి సౌజన్యంతో) ✦

# నాయకులు వస్తే ఇంత ఆర్భాటమా!

మంత్రులు కూడా ప్రజాసేవకులేనని, వాళ్లు జిల్లాకు వస్తే ఎందుకు భారీ హంగు, ఆర్భాటాలు చేస్తున్నారని లోక్‌సత్తా 2.0 ఉద్యమ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు ప్రశ్నించారు. ఇటీవల ఐ.టి, మునిసిపల్ శాఖా మంత్రి కె. తారకరామారావు వరంగల్ నగరానికి వచ్చినప్పుడు.. పబ్లిక్ స్థలాల్లో, పార్కులలో రోడ్ల మీద ఫ్లెక్సీలు, బ్యానర్లు చూస్తే జుగుప్స కలుగుతుందన్నారు. తన ఫ్లెక్సీలనైనా తొలగించాలని ఒకప్పుడు తానే అన్న మాటల్ని కేటీఆర్ గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. మంత్రులు, వారసత్వపు నాయకమణులు వచ్చినప్పుడు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, కార్పొరేటర్లు నల్లధనంతోనే తోరణాలు, స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. నల్లధనానికి మూలం రాజకీయ రంగంలోనే, ఓట్ల కొనుగోలులోనే ఉందని, పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) వల్ల చెప్పుకోదగ్గ ఫలితం రావాలంటే ముందు ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేయాలని అన్నారు. ప్రతి ఓటుకు విలువ ఉండేలా దామాషా ఎన్నికల పద్ధతిని తీసుకురావాలని, ఎమ్మెల్యేలతో అవినీతి బంధానికి ఆస్కారం లేకుండా ముఖ్యమంత్రులకు ప్రత్యక్ష ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈరకమైన ఎన్నికల సంస్కరణల వల్ల ప్రజాసేవ చేయాలనే తపనగలవారు, సమర్థులు రాజకీయాలలోకి వచ్చి వేగంగా ఎదగగలుగుతారన్నారు. తద్వారా దేశం అన్ని రకాలుగా సుసంపన్నమవుతుందన్నారు. ఈ ఎన్నికల సంస్కరణలతోపాటు కావాలంటే లోక్‌సభ, అసెంబ్లీలకు దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలను జరుపుకోవచ్చన్నారు. ✦

# పంటల ధర నిర్ణయాధికారం రైతుకే ఇవ్వాలి : యూత్ పార్లమెంట్






వ్యాపార రంగంలో ధరల్ని సంస్థల యజమానులు నిర్ణయించుకున్నట్టే, పంటలకు న్యాయమైన ధరల్ని నిర్ణయించుకునే అధికారం రైతులకే ఇవ్వాలని, స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేసి వ్యవసాయాభివృద్ధితో సంధానం చేయాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ డిమాండ్ చేశారు.

హైదరాబాద్ రాయదుర్గం టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో 'వ్యవసాయ సమస్యలు, రైతు ఆత్మహత్యలు'పై జరిగిన యూత్ పార్లమెంట్‌లో జేపీ ముఖ్యఅతిథిగా పాల్గన్నారు. ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్), విజన్ ఇండియా ఫౌండేషన్ (వీఐఎఫ్) నాలెడ్జి పార్ట్‌నర్లుగా వ్యవహరించాయి. విద్య, నల్లధనం – డీమానిటైజేషన్ తదితర అంశాలపై ఇప్పటికే పలుచోట్ల యూత్ పార్లమెంట్ నిర్వహించిన సంగతి తెలిసిందే.

పెట్టుబడి అధికమవటం, ఆశించిన దిగుబడి సాధించలేకపోవటం, ఉత్పత్తులకు సరైన ధర లేకపోవటంతో రైతులు తీవ్ర ఆర్థిక ఒత్తిడికి లోనవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని జేపీ అన్నారు. పాలకులు, ప్రభుత్వాధికారులు చేస్తున్న ప్రణాళికలు క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలు పరిశీలించకుండానే రూపొందిస్తున్నారన్నారు. దీనివల్ల ప్రభుత్వాలు రైతుల కోసం తీయని మాటలతో ఎన్ని స్కీముల్ని ప్రకటించినా, అవి వాస్తవాలకు దూరంగా ఉండటంతో క్షేత్రస్థాయిలో రైతులకు చేరటం లేదన్నారు. రైతు లాభం కేవలం కాగితాలకే పరిమితమైందన్నారు. వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేయాలంటే రైతులకు అందుబాటులో ఉండి, సమస్యలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయగలిగిన స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నిధులు, అధికారాలు ఉన్న స్థానిక ప్రభుత్వాలను రైతుల ప్రయోజనాలతో అనుసంధానం చేయాలన్నారు. రైతులకు పంటల బీమాపై అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యకరమైన భారతదేశంలో ఆనందమయమైన రైతు జీవనం ఉండేలా దేశాన్ని తయారుచేయాలని, రైతు ఆత్మహత్యలనేవే లేకుండా చేయాలని అన్నారు. రైతుల ఓట్లతోనే గెలుస్తున్న






ప్రభుత్వాలకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. దూరదృష్టితో ఇటువంటి ఆచరణాత్మక వ్యవసాయ విధానాలను రూపొందించాలన్నారు.

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డా॥ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ, సాధారణ రైతులకిచ్చే ప్రోత్సాహకాలను సేంద్రియ ఎరువులతో పండించే రైతుల కివ్వాలని కోరారు.

ఐటీరంగ మాజీ ఉద్యోగి వట్టి వెంకట్ మాట్లాడుతూ, అనంతపురంలో 500 ఎకరాలలో సేంద్రియ ఎరువులతో పంటలు పండించే ప్రాజెక్ట్‌ను ఈ ఏడాది చేపట్టినట్టు చెప్పారు. సేంద్రీయ పంట ఉత్పత్తుల్ని ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తున్నామని చెప్పారు.

యూత్ పార్లమెంట్‌లో విద్యార్థులు అధికార పక్షంగా, ప్రతిపక్ష సభ్యులుగా వ్యవహరించి వ్యవసాయంపై ఢిల్లీ పార్లమెంట్‌లో జరుగుతున్న చర్చల తీరుపై, వాటిలోని లోపాలపై చర్చించారు. రైతులకు మద్దతు ధర, లాభసాటి ఆదాయం, నీటి సదుపాయం, సాంకేతిక విధానాలు, రాయితీలు తదితర అంశాలపై వాదోపవాదాలు జరిగాయి. రైతులకు సబ్సిడీతో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారకమందులు అందించటమేకాకుండా, ఉత్పాదకత పెంపునకు తగిన ఏర్పాట్లు చేయాలని, వడ్డీలేని రుణసౌకర్యం కల్పించాలని, పంటలకు లాభసాటి ధర లభించేందుకు మార్కెట్ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని పలువురు సభ్యులు సూచించారు. పంట ధరల్ని నిర్ణయించుకునే అధికారం రైతుకే ఉండాలన్న వాదనను సభ బలపరిచింది.

యూత్ పార్లమెంట్‌లో చర్చల సారాంశాన్ని నీతి ఆయోగ్ ద్వారా ప్రభుత్వానికి పంపుతామని యూత్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ రవి రాఘవేంద్ర తెలిపారు. రోడామిస్త్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఏడు రోజులు గ్రామాలలో పర్యటించి రూపొందించిన అంశాలను కూడా పార్లమెంట్ చర్చించిందన్నారు. ఇందులో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, వాస్తవంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్ని చర్చించి రైతులకు ఉపయోగపడే పరిష్కారాలను వెలువరించే ప్రయత్నం చేశామన్నారు. యూత్ పార్లమెంట్‌లో రాష్ట్రపతిగా రాజీవ్, ప్రధానమంత్రిగా మనోజ్, వ్యవసాయ మంత్రిగా లక్ష్మీనరసింహ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రిగా సాక్షి, ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా వరుణ్ వ్యవహరించారు. ✦

# పౌరసేవల చట్టంపై కేసీఆర్ ప్రభుత్వ చొరవ అభినందనీయం, ఎటువంటి సహకారమైనా అందిస్తాం: లోక్‌సత్తా

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు హక్కుగా సేవలందించే 'పౌర సేవల' (రైట్ టూ సర్వీసెస్) చట్టం తీసుకురావటానికి తెలంగాణ ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించటం పట్ల లోక్‌సత్తా హర్షం ప్రకటించింది. ఈ చట్టం వల్ల సామాన్య ప్రజలకు ధ్రువపత్రాలు, నల్లా. విద్యుత్ కనెక్షన్లు, పట్టాదారు పాసుపుస్తకాలు, ఇళ్ల పట్టాలు వంటి రోజువారీ సేవలన్నీ వేధింపులు, లంచాలు లేకుండా అందుబాటులోకి వస్తాయని .. వ్యాపార నిర్వహణ కూడా సులభతరమై ఉపాధి అవకాశాలు పెరుగుతాయని లోక్‌సత్తా 2.0 ఉద్యమ సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ బండారు రామ్మోహనరావు అన్నారు.

తెలంగాణలో ముసాయిదా చట్టాల రూపకల్పన చేస్తున్న నల్సార్ లా యూనివర్సిటీకి రైట్ టూ సర్వీసెస్ బిల్లు తయారీ బాధ్యతను అప్పగించారు. తాజా బడ్జెట్ సమావేశాలలోనే ఈ బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం.

'స్వరాజ్యం' పేరుతో పౌర సేవల పత్రాల్ని (సిటిజన్ ఛార్టర్) 1998లో పుస్తకరూపంలో ఆవిష్కరించటం దగ్గర్నుంచి ఈ చట్టంపై లోక్‌సత్తా పనిచేస్తోందని, 2011-12లో పార్లమెంటు కమిటీ విజ్ఞప్తి మేరకు దేశవ్యాప్త పౌర సేవల బిల్లును లోక్‌సత్తా రూపొందించిందని.. ఈ తరహా చట్టంపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆసక్తి కనబరిచారని మీడియా ద్వారా తెలుసుకున్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ లోక్‌సత్తా రూపొందించిన పౌర సేవల చట్టం నమూనాని అక్టోబర్ 19, 2016న ఆయనకు పంపారని రామ్మోహనరావు గుర్తుచేశారు. సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ), లోక్‌పాల్ కన్నా శక్తిమంతమైన పౌర సేవల చట్టాన్ని అమలు చేస్తే తెలంగాణ పాలనా వ్యవస్థలో ఒక మైలురాయి అవుతుందన్నారు. జిల్లాల్లో మెరుగైన పాలనకు, మన ఊరు- మన ప్రణాళిక వంటి కార్యక్రమాలు విజయవంతమవటానికి ఈ చట్టం ఎంతో అవసరమన్నారు.

ఎలక్ట్రానిక్ సహా అన్ని రకాల సేవలనూ ఒకే గొడుగు కిందకు తెచ్చి పౌర సేవల చట్టాన్ని అమలు చేయాలని, ప్రజలకు చేయాల్సిన పనికి నిర్ణీత గడువు మాత్రమే ఉంటే సరిపోదని, సకాలంలో పని చేయకపోతే రోజుకు కనీసం రూ.250 జరిమానా కూడా ఉండాలని, సంబంధిత అధికారుల్ని జవాబుదారులుగా చేయాలని రామ్మోహనరావు అన్నారు. లోక్‌సత్తా కృషి వల్ల 2001లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కుత్బుల్లాపూర్, తణుకు, గుంటూరు మునిసిపాలిటీల్లో కొన్ని సేవలకు సిటిజన్ ఛార్టర్ అమలు చేసిందని, అయితే చట్టరూపం లేకపోవటం వల్ల అవి నీరుగారిపోయాయని అన్నారు. ఆ తర్వాత కొన్ని రాష్ట్రాలు ఈ చట్టాన్ని అమలుచేయనారంభించాయన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ సేవలకు నిర్ణీత గడువు, సకాలంలో చేయకపోతే జరిమానా ఏర్పాట్లతో లోక్‌సత్తా రూపొందించిన పౌర సేవల బిల్లు పార్లమెంటు ఆమోదం కోసం ఎదురు చూస్తోందన్నారు. కేంద్ర బిల్లు ఆమోదం పొందేలోగానే రాష్ట్రాలు చట్టాన్ని రూపొందించుకుని అమలు చేయటం అవసరమని, ఈ దిశగా కేసీఆర్ ప్రభుత్వం చురుగ్గా వ్యవహరించటం అభినందనీయమన్నారు. బిల్లు రూపకల్పనలో ఎటువంటి సహకారం కావాలన్నా అందించటానికి లోక్‌సత్తా సిద్ధంగా ఉందన్నారు.

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఈ తరహా చట్టం తేవాలి**

పెద్ద నోట్లు రద్దు చేసినా, సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఆగలేదని, నూతన రాజధాని అమరావతిలో కూడా లంచాల దందా యథేచ్ఛగా సాగుతోందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఏమాత్రం తాత్సారం చేయకుండా ఇదే నమూనాలో పౌర సేవల చట్టాన్ని అమలు చేయాలని బండారు రామ్మోహనరావు విజ్ఞప్తి చేశారు. ✦

# తెలంగాణలో ఎస్సీ, ఎస్టీలపై పెరిగిన దాడులు

తెలంగాణలో దళితులు, గిరిజనులపై దాడులు పెరిగినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వివిధ సందర్భాలు, గొడవల్లో దాడులతోపాటు హత్యలు, అత్యాచారాలు వంటి కేసులు పెరిగినట్టు ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టం కింద నమోదైన వివరాలు తెలియచేస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం ఫిర్యాదులతో పోలిస్తే 2016 నాటికి ఆ సంఖ్య భారీగా పెరిగింది. కేసుల విచారణలో జాప్యం కారణంగా బాధితులకు సరైన న్యాయం జరగటం లేదు. ఈ కేసులపై రాష్ట్ర స్థాయి ఉన్నత కమిటీ ఒక్కసారీ సమావేశం కాలేదు. ఎక్కువ కేసుల్లో ఎఫ్ఐఆర్ పరిధి నుంచి అభియోగపత్రం వరకు వెళ్లటం లేదు. హత్యలు, దాడులు, అత్యాచారాలు జరిగిన పలు సందర్భాల్లో గ్రామాల్లోని పెద్దలు, రాజకీయ నాయకులు మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ ఏకపక్ష రాజీ కుదురుస్తున్నారు. కేసుల విచారణలో జాప్యం కారణంగా అప్పటివరకున్న సాక్షులు తరచూ విచారణ భయంతో తప్పుకుంటున్నారు. గత మూడేళ్లలో 1418 కేసులు పోలీసు విచారణ దశలోనే ఉండటం గమనార్హం. విచారణలో ఆలస్యం కారణంగా శిక్ష పడుతున్న కేసుల సంఖ్య చాలా తక్కువగా ఉంటోంది. ✦

# ఈఎస్ఐ డిస్పెన్సరీల సమస్యల్ని పరిష్కరించండి

తెలంగాణలోని ఈఎస్ఐ డిస్పెన్సరీల్లో రోగులకు ఎదురవుతున్న సమస్యల్ని పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని, ఫిర్యాదుల కొరకు టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా పార్టీ డిమాండ్ చేసింది. డాక్టర్లు సమయపాలన పాటించకపోవటం వల్ల రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, వైద్యసిబ్బందికి బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేయాలని కోరింది. ఈ మేరకు లోక్‌సత్తా పార్టీ నాయకులు కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయను కలిసి



విజ్ఞాపన పత్రం అందచేశారు. బడంగ్‌పేట్ నగర పంచాయతీ, మీర్‌పేట్, జిల్లెలగూడ, జల్‌పల్లి మునిసిపాలిటీ అన్నిటికీ బాలాపూర్ మండల కేంద్రంగా ఈఎస్ఐ ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నేతలు కలిదిండి శ్రీనివాస్ వర్మ, రాజీవ్ కుమార్, శివరామకృష్ణ, నందూరి సరోజాదేవి, వెంకటేష్ మునుపల్లి, తిమ్మన వినోద్ లోక్‌సత్తా తదితరులు పాల్గొన్నారు. ✦

# ఎఫ్‌డీఆర్ టీంతో అభిప్రాయాల్ని పంచుకున్న సంజయ్

సీఆర్ఐఈఆర్, న్యూఢిల్లీ సీనియర్ కన్సల్టెంట్ సంజయ్ పులిపాక ఇటీవల హైదరాబాద్‌లోని ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఆర్ రీసెర్చి బృందం ఆయనతో ప్రభుత్వ విధానాలు, రాజకీయాలు, రాజకీయ మార్పులు, విదేశాంగ విధానాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలపై చర్చించింది. ✦



## Feeling Encouraged !




Foundation of Democratic Reforms has been featured in the 2016 Global Go To Think Tank Index Report in the category of Top Domestic Health Policy Think Tank and also for Best Policy Study Report produced by a Think Tank 2016 (Suggestions on draft "National Education Policy Report").

The report is the leading think tanks and civil societies program produced by University of Pennsylvania.

Congratulations to all who have contributed in the development of the organisation and enrichment of the discourse on reforms.




దేశంలో నిజమైన వ్యవస్థీకృత మార్పునకు నాంది పలికిన లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ జీవితాన్ని ఆ దిశగా మలచింది  గుంటూరు వైద్య కళాశాల క్యాంపస్. ఎమర్జెన్సీ పరిణామాల నేపథ్యంలో సంస్కరణోద్యమాన్ని మొదలుపెట్టిన జేపీ.... గత నాలుగు దశాబ్దాలుగా భారతదేశాన్నే తింటూ, భారతదేశాన్నే తాగుతూ, భారతదేశాన్నే మాట్లాడుతూ ఎటువంటి అధికారం లేకుండానే పలు కీలక రాజ్యాంగ సవరణల్ని చట్టాలని సాధించారు. హేతుబద్ధత, బహిరంగ చర్చ ప్రమాణాలున్న కొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలికారు. 'ప్రజలే ప్రభువులు', పాలకులు సేవకులే', 'మంచి రాజకీయాన్ని మించిన పవిత్ర వ్యాసంగం లేదు' వంటి కొత్త నినాదాలతోపాటు 'ప్రజల పన్నులు డబ్బుకు తగ్గ సేవలు' వంటి కొత్త ఆలోచనలకు తగ్గ పదబంధాల్ని సృష్టించారు. 'నివారించదగ్గ బాధలను తొలగిస్తూ వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలనిచ్చే' మార్పుని వీలైనంత వేగంగా సాధించేందుకు అదే దృఢసంకల్పంతో ముందుకు సాగుతున్నారు. జేపీతోపాటు ఆనాటి వైద్య విద్యార్థులు పలువురు ఇటీవల గుంటూరులో కలసిన అపురూప దృశ్యమిది.

Posting Date 22-02-2017
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on Feb16th 2017

# నిజాలు మాట్లాడుకుందాం-14



## గ్రామ న్యాయాలయాలు

2003 లో లోక్ సత్తా జిల్లాల్లో ప్రజాభిప్రాయాన్ని సేకరించి స్థానిక న్యాయాలయాల చట్టాన్ని NAC లో ప్రతిపాదించింది . దాని ఆధారంగా 2009 లో జాతీయ స్థాయిలో స్థానిక గ్రామాలయాల చట్టం వచ్చింది .

## తక్కువ ఖర్చు - సత్వర న్యాయం

షేర్ చెయ్యండి ...ప్రజలకు నిజాలు చేరవేయండి

Book-Post
PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad